PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 166 | విజయవాడ, బుధవారం 18 జనవరి 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 18 January 2023 | Rs

రైతులకు షాక్!

- భారంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ధరలు
- ఇతర ఉపకరణాలపైనా భారీగా పెంపు

లోపలి పేజీలో..



నేడు ఉప్పల్‌లో భారత్ X న్యూజిలాండ్ వన్డే


- 2,500 మందితో పటిష్ట భద్రత
- టికెట్లు బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు
- రాచకొండ సిపి

లోపలి పేజీలో..

తగ్గిన ఎగుమతులు

ఒకే నెలలో 12శాతంపైగా క్షీణత

మార్కెట్లను వెంటాడుతున్న మాంద్యం భయం




న్యూఢిల్లీ : అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం భయాలు దేశీయ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వివిధ దేశాలు సరుకుల దిగుమతులపై ఆంక్షలు విధిస్తున్నాయి. ఫలితంగా భారత్ ఎగుమతులు గణనీయంగా తగ్గాయి. దీంతో వాణిజ్యలోటు పెరుగుతోంది. ఈ పరిస్థితి ఆర్థిక రంగ నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది. కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు,వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం డిసెంబర్ నెలలో 12.25 శాతం మేర ఎగుమతులు తగ్గాయి. సేవారంగంతో కలిపి వాణిజ్య ఎగుమతులు 2021 డిసెంబర్ నెలలో 65.25 బిలియన్ డాలర్ల మేర వివిధ దేశాలకు మన దేశం నుండి ఎగుమతులు జరిగాయి. 2022 డిసెంబర్‌లో ఈ మొత్తం 61.82 బిలియన్‌డాలర్లకు పడిపోయింది. ఇంజినీరింగ్, వజ్రాలు, ఆభరణాలు, పత్తి, కార్పెట్స్, ప్లాస్టిక్, లినోలియమ్ ఉత్పత్తులకు సంబంధించిన ఎగుమతుల్లో గణనీయ తగ్గుదల కనిపించింది. గత ఏడాది డిసెంబర్‌లో 16.6శాతం మేర ఎగుమతుల్లో తగ్గుదల నమోదైంది. ఆ తరువాత మళ్లీ డిసెంబర్ నెలలో భారీగా ఎగుమతులు తగ్గడం వాణిజ్యవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అమెరికా, అరబ్‌ఎమిరేట్స్, నెదర్లాండ్స్, చైనా, బంగ్లాదేశ్‌లకు చేసే ఎగుమతుల్లో తగ్గుదల నమోదైనట్లు అధికారవర్గాలు తెలిపాయి. వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భరత్వాల్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ చైనా దిగుమతులను గణనీయంగా తగ్గించడంతో ప్రపంచవ్యాప్తంగానే వాణిజ్య రంగంలో తగ్గుదల నమోదైందని, దాని ప్రభావం భారతదేశం మీద కూడా పడిందని చెప్పారు. అయితే, దేశీయ సేవా రంగాల పనితీరు ఆశాజనకంగానే ఉన్నాయని ఆయన అన్నారు. మరోవైపు డిసెంబర్ నెలలో దిగుమతుల్లో కూడా తగ్గుదల నమోదైంది. 2021 డిసెంబర్‌లో 75.28 బిలియన్ డాలర్ల దిగుమతులు నమోదుకాగా, ఈ ఏడాది ఆ మొత్తం 73.80 బిలియన్ డాలర్లకు తగ్గింది.

పెరిగిన లోటు

ఎగుమతులతో పాటు దిగుమతుల్లో కూడా తగ్గుదల నమోదైనప్పటికీ వాణిజ్యలోటు గణనీయంగా పెరిగింది. నవంబర్ నెలలో 22.6 బిలియన్ డాలర్ల వాణిజ్యలోటు నమోదుకాగా, డిసెంబర్ నెలలో 23.8 బిలియన్ డాలర్ల లోటు నమోదైంది. గత ఏడాది డిసెంబర్ నెలతో పోలిస్తే ఇది దాదాపు 13 శాతం ఎక్కువ. కరెంట్ అక్కౌంట్ డెఫిసిట్ (సిఎడి) 36.4 బిలియన్ డాలర్లకు చేరింది. జిడిపిలో ఇది 4.4 శాతం. ఈ స్థాయిలో సిఎడి ఎప్పుడూ నమోదు కాలేదని చెబుతున్నారు.

డిసెంబర్‌లో వాణిజ్యం



పాఠశాలలు, సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు


- 19 నుంచి 4 రోజులు
- ఫిబ్రవరిలోనూ 4 రోజులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆధార్ నమోదు, సవరణల కోసం పాఠశాలలు, సచివాలయాల్లో ఈ నెల 19 నుంచి నాలుగు రోజులు, మళ్లీ ఫిబ్రవరి నెలలో 7 నుంచి నాలుగు రోజులు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు గ్రామ వార్డు సచివాలయాల శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలకు కూడా ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ నమోదు క్యాంపులు జనవరి 19, 21, 23, 24తో పాటు ఫిబ్రవరి 7 నుంచి 10 వరకు ఆదార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాలలు, సచివాలయాల్లో బయోమెట్రిక్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. యుడిఎఐ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 80 లక్షల ఆధార్‌లకు సంబంధించిన బయోమెట్రిక్ వివరాలు పెండింగ్‌లో ఉన్నాయి. 100 శాతం నమోదు కోసం మొబైల్ ఆధార్ నమోదు క్యాంపులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపిడిఓ/మునిసిపల్ కమిషనర్లు/ఎంపిడిఓలు 19, 21, 23, 24 తేదీల్లో అన్ని పాఠశాలలు, సెక్రటరియేట్ల పరిధిలో కవర్ చేయాలని సూచించారు. అదే విధంగా అవసరమైన చోట మండల విద్యాశాఖాధికారి, ఎంపిడిఓ, మునిసిపల్ కమిషనర్లు మొబైల్ క్యాంపుల నిర్వహణతో పాటు మ్యాపింగ్ ప్రక్రియ జరిగే విధంగా సూచనలు చేయాలని ప్రభుత్వం కోరింది. ఆధార్ ఆపరేటర్లు, పిఎస్ఎస్/ డబ్ల్యుఎస్ఎస్ మొబైల్ ఆధార్ క్యాంపుల గురించి పాఠశాలలు, ప్రజలకు అవసరమైన అవగాహన కలిగించాలని, ఆధార్ ఆపరేటర్లు హార్డ్‌వేర్ పరికరాలు వర్కింగ్ కండీషన్‌లో ఉంచుకోవాలని, ఎంపిడిఓలు మొబైల్ క్యాంప్‌లో ఇద్దరు వాలంటీర్లు, ఇద్దరు సెక్రటరియేట్ సిబ్బంది అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు.

జిఒ -1పై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం సవాల్

న్యూఢిల్లీ : జిఒ -1పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పార్టీల రోడ్ షోలు, సభలపై ఆంక్షలు విధిస్తూ తెచ్చిన జిఒ నెంబరు 1ని తాత్కాలికంగా నిలిపివేస్తూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రహదారులపై బహిరంగ సమావేశాలు



నిర్వహించకుండా రాజకీయ పార్టీల గొంతు నొక్కడానికి రాష్ట్రప్రభుత్వం జనవరి 2న జిఒ నెంబరు 1 తీసుకొచ్చిందంటూ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. 'పోలీసులను సంతృప్తిపరచాలని షరతు పెట్టడం రాజ్యాంగ హక్కులను హరించడమే. నచ్చినవారికి అనుమతి ఇచ్చి, నచ్చనివారికి నిరాకరించాలనే ఈ షరతుపెట్టారు. రహదారులపై నిర్వహించే సమావేశాలు, ఊరేగింపులు, యాత్రల నియంత్రణకే పోలీసు చట్టం సెక్షన్ 30(2) పోలీసులకు అధికారం కల్పిస్తోంది. ఆ సెక్షన్‌ను ఆసరాగా చేసుకుని నిషేధం విధిస్తామంటే కుదరదు. బహిరంగ సమావేశాల నియంత్రణ ముసుగులో ప్రభుత్వం పూర్తి నిషేధం విధిస్తోంది. జీవో అమలును నిలుపు చేస్తూ మధ్యంతర ఉత్తర్వులివ్వండి' అని కోరారు. ప్రభుత్వం తరపున ఎజి శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. పిల్ విచారణార్హతపై అభ్యంతరం ఉందన్నారు. ఇరు వైపులా వాదనలు విన్న ధర్మాసనం.. పోలీసు చట్టం సెక్షన్ 30కి విరుద్ధంగా జిఒ నెంబరు 1 ఉందని ప్రాథమికంగా అభిప్రాయపడింది. జిఒ నెంబరు 1 అమలును ఈ నెల 23 వరకు నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. తదుపరి విచారణను ఈనెల 20కి హైకోర్టు వాయిదా వేసింది.

న్యాయవ్యవస్థసహా అన్నింటినీ బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కబళిస్తున్నాయి

- కాంగ్రెస్, టిఎంసి విమర్శ

హోషియార్‌పూర్, కోల్‌కతా, న్యూఢిల్లీ : దేశంలోని అన్ని వ్యవస్థలను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు కబ్జా చేస్తున్నాయని, ప్రధానంగా న్యాయ వ్యవస్థను పూర్తిగా తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకే కొలీజియం సిఫార్సులను నెలలు, సంవత్సరాల తరబడి తొక్కిపెడుతున్నారని కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కొలిజీయం వ్యవస్థను పునర్నిర్మించడానికి కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు చేసిన సూచన న్యాయ వ్యవస్థకు విషపు గుళిక వంటిదని వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కొలీజియంలో కేంద్ర ప్రభుత్వ నామినీ, హైకోర్టు కొలీజియంల్లో రాష్ట్ర ప్రభుత్వ నామినీ వుండాలని సూచిస్తూ కిరణ్ రిజిజు భారత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్‌కి లేఖ రాయడంపై పలువురు నేతలు ఘాటుగా స్పందించారు.

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ మీడియా, ఎన్నికల కమిషన్, న్యాయ వ్యవస్థ, ఇలా అన్ని వ్యవస్థలపై చాలా ఒత్తిడి వుందని అన్నారు. ఈనాడు దేశంలోని అన్ని సంస్థలను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు నియంత్రిస్తున్నాయని, అన్ని సంస్థలపై ఒత్తిడి కూడా అలాగే వుందని అన్నారు. ఇదేమీ ఒక రాజకీయ పార్టీతో మరో రాజకీయ పార్టీ పోరాటం కాదని అన్నారు. దేశంలోని పలు సంస్థలు, వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలనుకుంటున్న బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లకు, ప్రతిపక్షానికి మధ్య పోరాటమని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రజాస్వామ్య క్రమమనేది లోపిస్తోందని విమర్శించారు. పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంపై తీవ్రంగా విమర్శలు చేశారు. పంజాబీ మాత్రమే పంజాబ్ నుండి పోటీ చేయాలని, ఢిల్లీ నుంచి కాదని వ్యాఖ్యానించారు.

ఉద్దేశ్యపూర్వకంగానే దాడులు

తమ సైద్ధాంతిక భావజాలానికి అనుకూలమైన వ్యక్తులను నియమించే వరకు న్యాయమూర్తుల నియామకాన్ని కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది. విభేదాలను రూపొందించి, తత్ఫలితంగా ప్రతిష్టంభనను సృష్టించడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణదీప్ సూర్జివాలా విమర్శించారు. న్యాయ వ్యవస్థ సమగ్రత, స్వాతంత్ర్యంపై ప్రధాని, న్యాయ శాఖ మంత్రి, ఇతర రాజ్యాంగ బాధ్యతల్లో ఉన్నవారు మిగతా 5లో

బిజెపి అధ్యక్షుడిగా నడ్డా కొనసాగింపు

- 2024 జూన్ వరకు పొడిగింపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి జాతీయ అధ్యక్షుడిగా జయప్రకాష్ (జెపి) నడ్డా పదవీ కాలాన్ని 2024 జూన్ వరకు పొడిగించారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, పార్టీ అధ్యక్షుడు నడ్డాల నాయకత్వంలో 2024 లోక్‌సభ ఎన్నికల్లో గతం కన్నా ఎక్కువ స్థానాలను కైవసం చేసుకోగలమనే ధీమాను వ్యక్తం చేసింది. 2019లో బిజెపి వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నడ్డా 2020లో పూర్తి కాలపు అధ్యక్ష పదవిని చేపట్టారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ 2024 లోక్‌సభ ఎన్నికల వరకు పార్టీ జాతీయ అధ్యక్షునిగా నడ్డా కొనసాగు తారని చెప్పారు. నడ్డా నాయకత్వంలో గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో పార్టీ ఘనవిజయం సాధించిందని చెప్పారు. 2019 ఎన్నికల్లో వచ్చిన ఎంపి స్థానాల కన్నా ఎక్కువ స్థానాలు 2024లో బిజెపికి లభిస్తాయని చెప్పారు. సోమవారం ప్రారంభమైన బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశాలు మంగళవారం ముగిశాయి.

బెంగళూరు సర్వం సిద్ధం

నేటి నుంచి సిఐటియు అఖిల భారత మహాసభ



బెంగళూరు నుంచి ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి

సిఐటియు అఖిలభారత 17వ మహాసభ వేదికగా శ్రమజీవుల మేథోమథనానికి బెంగళూరులో రంగం సిద్ధమైంది. బుధవారం నుండి ఈ నెల 22వ తేదీ వరకూ ఐదు రోజులపాటు జరనున్న ఈ మహాసభకు దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికలోకపు ప్రతినిధులు తరలిరానున్నారు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతినిధులు చర్చించనున్నారు. దాంతో పాటు ముంచుకొస్తున్న మతతత్వ ప్రమాదం, ఆధునిక ఉత్పాదక రంగంలో కార్మికులను సంఘటితం చేసే పోరాటాలు తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నారు. మొత్తం 1500 మంది ప్రతినిధులు మహాసభకు హాజరుకానుండగా, వీరిలో పలువరు మంగళవారం సాయంత్రానికే నగరానికి చేరుకున్నారు. బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని గాయత్రి విహారలో ప్రతినిధుల సభ బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుంది. ఈ ప్రాంగణానికి శ్యామల్ చక్రవర్తి నగర్‌గా నామకరణం చేశారు. సిఐటియు జాతీయ అధ్యక్షులు హేమలత పతాకావిష్కరణ చేసి మహాసభను ప్రారంభించనున్నారు. మొదటి రోజు మహాసభ ప్రారంభోత్సవానికి జాతీయ స్థాయి కార్మిక సంఘం నాయకులు హాజరై తమ సంఘీభావం తెలియజేయనున్నారు. మధ్యాహ్నం నుంచి ప్రతినిధుల సభ ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు పూర్తి స్థాయి చర్చలు జరగనున్నాయి.

21న నాలుగు అంశాలపై సదస్సులు

ఈ నెల 21న నాలుగు అంశాలపై సదస్సు జరగనుంది. ఆధునిక ఉత్పాదక రంగంలో కార్మికులను సంఘటితం చేయడం ప్రాముఖ్యత-సవాళ్లు, 2. వలస కార్మికుల పరిస్థితి-వ్యవస్థీకరణ సవాళ్లు, 3. ఉపాధి విధానాలు మార్చడం, 4. కార్మిక సంఘీభావం-మతత్వ ప్రమాదాలు అనే అంశాలపై ప్రతినిధులు నాలుగు భాగాలు విడిపోయి ఈ నాలుగు అంశాలపై చర్చించనున్నారు.

22న భారీ బహిరంగ సభ

మహాసభ ఆఖరి రోజు అయిన ఈ నెల 22న బెంగళూరులోని నేషనల్ కాలేజీ గ్రౌండ్స్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు భారీ బహిరంగ సభ జరగనుంది. దీనిని జయప్రదం చేయాలని కోరుతూ ఇప్పటికే కర్ణాటకలో పెద్ద ఎత్తున సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రచారం నిర్వహించింది. కేంద్ర మిగతా 5లో

రైతులకు 'మద్దతు' కావాలి

అసంఘటిత రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచాలి

ప్రాంతాల వారీగా పరిశోధనలు జరగాలి

ప్రముఖ సామాజికార్థికవేత్త సూర్యదేవర మహేంద్రదేవ్

(వల్లభనేని సురేష్)

"దేశంలో వ్యవసాయ రంగ అభివృద్ధి ఇటీవల కాలంలో ఒకశాతం కూడా లేదు. ప్రకృతి విపత్తుల వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోంది. విపత్తులను తట్టుకునే విధంగా వంగడాలను రూపొందించే పరిశోధనలో దేశం వెనుకబడి ఉంది. ఏ పంటకూ మద్దతు ధర దక్కటం లేదు. మధ్యవర్తుల ప్రమేయం ఎక్కువగా ఉంది. రైతులకు గిట్టుబాటు కల్పించే విషయంలో ప్రభుత్వ మద్దతు అవసరం ఉంది. అది ఒక వరికే గాకుండా అన్ని రకాల పంటలకూ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఉపాధి హామీలోనూ, అసంఘటిత రంగానికి బడ్జెట్ కేటాయింపులు పెంచడం ద్వారానే మెరుగైన అభివృద్ధిని సాధించగలం" అని ప్రముఖ సామాజికార్థికవేత్త, ఆర్‌బిఐ మాజీ డిప్యూటీ గవర్నర్, ఇక్ఫాయ్ ఆచార్యులు, వ్యవసాయ ధరల నిర్ణాయక మండలి మాజీ ఛైర్మన్ సూర్యదేవర మహేంద్రదేవ్ తెలిపారు. ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా తుమ్మపూడి వచ్చిన సందర్భంగా ప్రజాశక్తితో ఆయన అభిప్రాయాలు పంచుకున్నారు...

దేశంలో వ్యవసాయరంగ పరిస్థితి ఏమిటి ?

జాతీయ స్థాయిలో వ్యవసాయరంగ అభివృద్ధి సరిగాలేదు. అనుబంధ రంగాలు బాగానే ఉన్నాయి. క్రాప్ సెక్టార్లో అభివృద్ధి ఒకశాతం మాత్రమే ఉంది. అందులోనూ వ్యవసాయ కార్మికులకు ఒక హెక్టారుకు ఆదాయం 600 మాత్రమే ఉంది. ఇదే ఆదాయం ఒక రాష్ట్రంలో కొంత ఎక్కువగానూ మరికొన్ని రాష్ట్రాల్లోనూ తక్కువగా ఉంది. బీహార్, ఉత్తరప్రదేశ్ అయితే చాలా తక్కువగా ఉంది. అందువల్లే ఆయా రాష్ట్రాల నుండి వలసలు ఎక్కువగా ఉన్నాయి.

మద్దతు ధరలు అమలవుతున్నాయా?

దేశంలో మద్దతు ధరలు ఇంకా లభించడం లేదు. ప్రభుత్వం కూడా రైతాంగానికి మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉంది. కోవిడ్ వల్ల అన్ని రంగాలూ దెబ్బతిన్నాయి. ఆదాయం తగినంత



కనిపించడం లేదు. యంత్రాలు పెరగడంతో కూలీలకు ఉపాధి తగ్గింది. అయితే చాలా దేశాల్లో వ్యవసాయ అనుబంధంగా పారిశ్రామిక రంగం పెరగడం వల్ల అక్కడ ఆదాయం మెరుగ్గా ఉంది. మన దేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ అలా లేదు. మహారాష్ట్రంలో హార్టికల్చర్ అభివృద్ధి జరిగి ఆగ్రో ప్రాసెసింగ్ ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ కొంత గిట్టుబాటు అవుతోంది. అది అన్ని ప్రాంతాల్లోనూ ఒకేలా ఉండకపోవచ్చు.

ధర లభించకపోవడానికి కారణం ఏమంటారు ?

మన దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ధరలను దళారులు నియంత్రిస్తున్నారు. ఉదాహరణకు టమోటా రైతు దగ్గర కిలో రూపాయికి కొంటున్నారు. అదే టమోటా బొంబాయిలోగానీ, విశాఖపట్నంలోగానీ కొనుగోలు చేయాలంటే కిలో రూ.40 ఉంటోంది. ఆగ్రో ఉత్పత్తులను నిల్వ చేసేందుకు కోల్డ్‌చైన్ కావాలి. బెంగాల్లో బంగాళాదుంపల విషయంలో ఇది మంచి ఫలితాలు ఇచ్చింది. పాల ఉత్పత్తుల్లో కొన్ని కంపెనీలు రైతులకు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయి. హార్టికల్చర్‌లో అది 20 శాతం లోపే ఉంటోంది. దాన్ని ప్రవేశపెడితే బాగానే ఉంటుంది.

ప్రకృతి విపత్తులు వ్యవసాయాన్ని దెబ్బతీస్తున్నాయి కదా ప్రత్యామ్నాయం ఏమైనా ఉందా ?

నిజమే. ప్రకృతి విపత్తులను తట్టుకుని నిలబడగలిగే వంగడాలను తయారు చేయాలి. దీనికి సంబంధించి పరిశోధన మన దేశంలో చాలా తక్కువగా ఉంది. ఉత్తర భారతంలో వేడిగాలులు పంటలను దెబ్బతీస్తున్నాయి. మన రాష్ట్రంతోపాటు దక్షిణాది రాష్ట్రాల్లో వరదలు, భారీ వర్షాలు నష్టం కలిగిస్తున్నాయి. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వాటిని తట్టుకుని నిలబడగలిగే విధంగా వంగడాలను తయారు చేయాలి. కానీ ఆ ప్రయత్నం జరగడం లేదు. ఇది రైతును తీవ్రంగా కుంగదీస్తోంది. ఏమి చేయాలన్నా సొంత పెట్టుబడితో చేయాల్సి వస్తోంది. విపత్తుల ఫలితంగా పంటలు దెబ్బతిని పోతే తీవ్ర కుంగుబాటుకు గురవుతున్నారు. అందుకనే రైతులకు ప్రభుత్వ మద్దతు చాలా ఎక్కువగా ఉండాలి. ప్రభుత్వం ఆదుకోకపోతే మరింత దిగజారిపోయే ప్రమాదం ఉంది. ఇది సామాజిక వ్యవస్థపై ప్రభావం చూపించవచ్చు.

పారిశ్రామిక రంగం పరిస్థితిపై మీ అంచనా ఏమిటి?


వ్యవసాయం ఒక్కటే చాలదు. పరిశ్రమల్లో ఉద్యోగాలు చేసుకోవడం ద్వారా అది కూడా అర్బన్ ఏరియాలతో కనెక్టివిటీ పెరిగితే మిగతా 5లో

రాయదుర్గంలో లాకప్‌డెత్?

- సిఐ సహా నలుగురు సస్పెన్షన్

ప్రజాశక్తి- రాయదుర్గం (అనంతపురం జిల్లా)

విచారణ నిమిత్తం స్టేషన్‌కు పోలీసులు తీసుకొచ్చిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. లాకప్‌డెత్‌గా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ఘటన అనంతపురం జిల్లా రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... గొర్రెలను దొంగతనం చేయడానికి వచ్చారని ఆరోపిస్తూ రాయదుర్గం పట్టణ పొలిమేరలోని పైతోట వద్ద సోమవారం వేకువజామున రెండు గంటల సమయంలో ఆత్మకూరు మండలం సనప గ్రామానికి చెందిన శ్రీనివాసులు, రామాంజనేయులు (28)ను గ్రామస్తులు పట్టుకున్నారు. వెంటనే వారిని పోలీసులకు అప్పగించారు. నిందితులపై సెక్షన్ 379 కింద పోలీసులు కేసు నమోదు చేసి రాయదుర్గం స్టేషన్లో ఉంచారు. వారిలో రామాంజనేయులు సోమవారం వేకువజామున పోలీస్ స్టేషన్లోని కంప్యూటర్ గదిలో తాను కట్టుకున్న లుంగీతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అనంతపురం జిల్లా ఎస్‌పి డాక్టర్ ఫక్కీరప్ప చెప్పారు. కాగా, అరెస్టు చేసిన వ్యక్తిని లాకప్ గదిలో ఉంచాల్సి ఉండగా, కంప్యూటర్ గదిలో ఉంచడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దర్యాప్తులో భాగంగా పోలీసులు చితకబాదడంతో మృతి చెంది ఉంటాడనే


రామాంజనేయులు మృతదేహం

అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించడం, మీడియాతో మాట్లాడనీయకుండా మృతుని కుటుంబసభ్యులను పోలీసులు అడ్డుకోవడం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

సమగ్ర దర్యాప్తునకు ఆదేశం : ఎస్‌పి ఫక్కీరప్ప

రాయదుర్గం పోలీసు స్టేషన్‌లో నిందితుడు మృతిపై సమగ్ర దర్యాప్తుకు ఆదేశించామని అనంతపురం ఎస్‌పి డాక్టర్ ఫక్కీరప్ప తెలిపారు. మంగళవారం ఉదయం ఆయన రాయదుర్గం పోలీసు స్టేషన్‌ను పరిశీలించి వివరాలు సేకరించారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన సిఐ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు గంగన్న, మధు, హోంగార్డ్ రమేష్‌లను విధుల నుంచి సస్పెండ్ చేశామని చెప్పారు. రామాంజనేయులుపై వివిధ పోలీసు స్టేషన్లలో కేసులు ఉన్నాయని తెలిపారు. పోలీసు స్టేషన్లో జరిగిన ఈ ఘటనపై కళ్యాణదుర్గం ఆర్‌డిఒను మెజిస్టీరియల్ విచారణ జరపమని కోరమని చెప్పారు. అనంతపురం డిఎస్‌పి ఆధ్వర్యంలో శాఖాపరమైన విచారణకు ఆదేశాలు ఇచ్చామని తెలిపారు.

19న విజయవాడలో వేమన జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా అధికార భాషా సంఘం ఆధ్వర్యంలో వేమన జయంతి ఉత్సవాలను ఈ నెల 19న ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ అధికార భాషా సంఘం అధ్యక్షులు పి విజయబాబు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్సవాల్లో భాగంగా విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు విజయబాబు తెలిపారు. కళాశాల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబరుకు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పిన ఫీడ్‌బ్యాక్ సూటిగా పత్రికకు ఉపయోగపడుతుంది. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విలువైన సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

దళితుల భూములకు రక్షణ కల్పించాలి

- వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - వత్సవాయి (ఎన్‌టిఆర్ జిల్లా)

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, పేదలు సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి మండలంలో అసైన్‌మెంట్ భూముల లబ్ధిదారులు మంగళవారం నిరసన చేపట్టారు. భీమవరం గ్రామం నుండి దళితుల భూముల వరకు ప్రదర్శన నిర్వహించారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న భూముల్లో కంపచెట్లను తొలగించారు. అక్కడే వంటావార్పు చేపట్టి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పెత్తందారులు, భూస్వాముల కబంధ హస్తాల్లో చిక్కుకున్న అసైన్డ్ భూములను లబ్ధిదారులకు తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. 1974లో భీమవరం గ్రామ దళితులు సాగుచేసుకునేందుకు ప్రభుత్వం ఇచ్చిన భూములను కొంతమంది భూస్వాములు బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. 9/77 చట్టం ప్రకారం దళితుల భూములు దళితులకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 237 భూ కేంద్రాల్లో దళిత భూముల పై పోరాటం చేస్తున్నామని తెలిపారు. అసైన్‌మెంట్ భూములను రద్దు చేసేందుకు ప్రభుత్వం జిఒ తీసుకొచ్చిందని, ఈ జిఒపై అధికార, ప్రతిపక్ష నేతలు మాట్లాడడంలేదని విమర్శించారు. ఈ జిఒపై కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో భీమవరం గ్రామ దళితుల నుండి లాక్కున్న భూములను భూస్వాముల నుంచి తిరిగి స్వాధీనం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే వాటిని స్వాధీనం చేసేంత వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటా కళ్యాణ్, సంఘం జగ్గయ్యపేట డివిజన్ అధ్యక్షులు కోట కృష్ణ, బి.రామ, నాయకులు సోమ రవి, నాయకులు గోళ్ల సుబ్బారావు, పాతినేని కొండలు, పిల్లి బ్రహ్మం, విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.



అసైన్డ్‌భూముల లబ్ధిదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజా గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 30వ తేదీన చేపట్టే 'ఉక్కు ప్రజాగర్జన' బహిరంగ సభను జయప్రదం చేయాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ పిలుపునిచ్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 705వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ డబ్ల్యుఆర్‌ఎం-1, 2 విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ మాట్లాడుతూ.. 'ఉక్కు ప్రజాగర్జన' ద్వారా కార్మికుల పోరాట సెగ ఢిల్లీ తగిలేలా చేయడానికి అత్యధిక సంఖ్యలో స్టీల్ కార్మికులు, నిర్వాసితులు కుటుంబ సభ్యులతో హాజరుకావాలని కోరారు.

సంక్రాంతి ఆదాయం రూ.141 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసి సంక్రాంతి పండుగకు రికార్డుస్థాయిలో ఆదాయాన్ని ఆర్జించింది. తిరుగు ప్రయాణంతో సంబంధం లేకుండా కేవలం ఈ నెల 6 నుండి 14 వరకు ఆర్‌టిసి రూ.141 కోట్ల ఆదాయాన్ని పొందింది. సంక్రాంతికి ముందు రోజుల్లో సాధారణ ఛార్జీలతో 3,120 బస్సులను నడపాలని తొలుత ఆర్‌టిసి నిర్ణయించింది. అయితే టిఎస్‌ఆర్‌టిసి, ప్రైవేట్ ఆపరేటర్ల అధిక ఛార్జీల వసూలు చేస్తుండటంతో ఆర్‌టిసి బస్సులకు రద్దీ పెరిగింది. దీంతో ఆర్‌టిసి ముందు నిర్ణయించిన 3,120 బస్సులకు కంటే అధికంగా 3,392 బస్సులను నడిపింది. గతేడాది 2,400 బస్సులే నడిపింది. ఈ ఏడాది దాదాపు వెయ్యి బస్సులు అధికంగా నడిపింది. సంక్రాంతి నేపథ్యంలో గతేడాది రూ.7.17 కోట్ల రోజూవారీ ఆదాయంతో మొత్తం రూ.107 కోట్లు ఆర్జించగా ఈ దఫా రూ.7.9 కోట్ల రోజువారీ ఆదాయంతో రూ.141 కోట్లు ఆర్జించింది. గతేడాది హైదరాబాద్ నుండి 824 బస్సులను నడపగా ఈ ఏడాది 1,483 బస్సులు నడిపింది. అంకితభావంతో పనిచేసిన సిబ్బందికి ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు.

'ధర్మా' బతికే ఉన్నాడు !

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపురంలో వ్యక్తి సజీవ దహనం కేసులో అనూహ్య విషయం వెలుగులోకి వచ్చింది. సెక్రటేరియట్ ఉద్యోగి ధర్మా నాయక్ తన డ్రైవర్‌ను హత్య చేసినట్లు తేలింది. బీమా డబ్బుల కోసమే నాటకం ఆడినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ నెల తొమ్మిదిన వెంకటాపురం వద్ద కారులో ఓ వ్యక్తి సజీవదహనమయ్యారు. ఈ ప్రమాదంలో మృతి చెందింది బీమ్లా తండాకు చెందిన ధర్మగా పోలీసుల దర్యాప్తులో మొదటగా తేలింది. హైదరాబాద్ సెక్రటేరియేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఆయన పని చేస్తున్నారు. ధర్మా భార్య నీల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ప్రమాద స్థలంలో పెట్రోల్ డబ్బా దొరకడంతో ఈ కేసును సవాల్‌గా తీసుకున్నారు. తన డ్రైవర్‌ను చంపేసి.. తానే చనిపోయినట్లు నిరూపించుకుని బీమా డబ్బులు పొందాలనుకొన్న ధర్మ ఎత్తుగడను పోలీసులు చిత్తు చేశారు. ఆయన సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఇంకా బతికే ఉన్నాడని నిర్ధారణకు వచ్చారు. ఆ దిశగా దర్యాప్తు కొనసాగించి గోవాలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ తీసుకొచ్చి విచారించడంతో అసలు విషయం బయటపెట్టాడు. అప్పులు చేసి బెట్టింగ్‌లు ఆడే అలవాటు ఉన్న ఆయన బీమా సొమ్ము కోసం ఈ అఘాత్యానికి పాల్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ధర్మను పోలీసులు కోర్టులో బుధవారం హాజరు పర్చనున్నారు.

'సరుకు'పై రోడ్‌ట్యాక్స్ భారం వేయొద్దు

- ఎపి లారీ ఓనర్స్ అసోషియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సరుకు రవాణా వాహనాలపై రోడ్ ట్యాక్స్ భారం వేయొద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఎపి లారీ ఓనర్స్ అసోషియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు పి గోపాల్‌నాయుడు, వైవి ఈశ్వరరావులు మంగళవారం వినతి పత్రం పంపారు. రాష్ట్రంలోని వాహనాలన్నింటికీ త్రైమాసిక రోడ్ ట్యాక్స్‌ను 25 నుండి 30 శాతం పెంచుతూ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల్లో సరుకురవాణా వాహనాలకు మినహాయింపును ఇవ్వాలని కోరారు. కోవిడ్ నేపథ్యంలో సరుకురవాణా రంగం ఇప్పటికే తీవ్ర సంక్షోభంలో వుందని, ఇంధన ధరలు కూడా అధికంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో రోడ్ ట్యాక్స్ భారం మోపడం సమజం కాదని పేర్కొన్నారు. అందువల్ల కనీసం సరుకు వాహనాలకైనా పన్ను మినహాయించాలన్నారు.

20 వరకు ఉచిత రేషన్ పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులందరికీ నిత్యావసర వస్తువుల పంపిణీ ప్రక్రియ ఈ నెలలో ఇంకా పూర్తి కాలేదని పౌరసరఫరాల శాఖ కమిషనరు హెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్డుదారుల సౌకర్యం కోసం ఈ నెల 20 వరకు పంపిణీ గడువును పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్డుదారులకు ఉచిత బియ్యం ఒక్కొక్కరికి 5 కిలోల వంతున ఇప్పటి వరకు 85 శాతం పంపిణీ జరిగిందని తెలిపారు. ఉచిత బియ్యంతో పాటు రూ.67 చొప్పున కిలో కందిపప్పు, రూ.17 వంతున అరకిలో పంచదార, అంత్యోదయ అన్న యోజన కార్డుదారులకు కేజీ పంచదార కిలో రూ.13.50 చొప్పున పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్డుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మొబైల్ వాహనం ద్వారా ఇంటి వద్దనే సరుకులు తీసుకోవాలని పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-కొత్తచెరువు



అప్పులబాధ తాకలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువులో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తచెరువు వడ్డెర కాలనీకి చెందిన దండగల రామచంద్ర (50)కు 3.50 ఎకరాల వ్యవసాయ పొలం ఉంది. ఇందులో వేరుశనగ, కంది పంటలను సాగుచేసేవారు. పంటల సాగు నిమిత్తం రూ.12 లక్షల వరకు అప్పులు చేశారు. గత ఐదేళ్లుగా పండిన పంటలు చేతికందకపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. దీంతో చేసిన అప్పులు తీర్చడం కష్టమైంది. అప్పులు తీర్చే మార్గంలేక తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ క్రమంలో లింగారెడ్డిపల్లి రహదారిలో పురుగుల మందు తాగారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను స్థానికులు గమనించి అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. రామచంద్రకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంగళగిరికి అటవీశాఖ కార్యాలయం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ప్రధానకార్యాలయం మంగళగిరికి మారనుంది. ప్రస్తుతం గుంటూరులో వున్న రాష్ట్ర అటవీశాఖ ప్రధానకార్యాలయం మంగళగిరిలోని ఆటోనగర్‌లో పివిఎస్ ల్యాండ్ మార్క్ భవనంలో ఏర్పాటు కానుంది. గురువారం నుండి పూర్తిస్థాయి కార్యకలాపాలు ప్రారంభమయ్యే ఈ కార్యాలయాన్ని రాష్ట్ర అటవీశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి వై మధుసూదన్‌రెడ్డి ప్రారంభించనున్నారు.

'స్వాతి' బలరామ్‌కు లోక్‌నాయక్ పురస్కారం

- నేడు విశాఖలో ప్రదానం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ



యార్లగడ్డ

'స్వాతి' పత్రిక వ్యవస్థాపక సంపాదకులు వేమూరి బలరామ్‌కు ఈ ఏడాది లోక్‌నాయక్ ఫౌండేషన్ పురస్కారం అందజేయనున్నారు. ఎన్‌టిఆర్ శత జయంతి సందర్భంగా విశాఖలోని సిరిపురం ఉడా చిల్డ్రన్ థియేటర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఈ అవార్డును బలరామ్‌కు అందజేయనున్నారు. ఈ విషయాన్ని లోక్‌నాయక్ ఫౌండేషన్ అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మంగళవారం తెలిపారు. విశాఖలోని ఒక హోటల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'స్వాతి' బలరామ్‌కు లోక్‌నాయక్ ఫౌండేషన్ సాహిత్య పురస్కారాన్ని, సిలికానాంధ్ర విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు డాక్టర్ కూచిభొట్ల ఆనంద్, కెఎల్ యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, జిఎస్‌ఎల్ మెడికల్ కాలేజ్ చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావుకు జీవన సాఫల్య పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. అలాగే 'అడవిరాముడు' చిత్ర బృందానికి ప్రత్యేక నగదు పురస్కారాలతో సత్కరిస్తామని తెలిపారు. ఈ చిత్ర దర్శకుడు రాఘవేంద్రరావు, నటీమణులు జయప్రద, జయసుధకు రూ.లక్ష చొప్పున నగదు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, సినీ నటులు బ్రహ్మానందం, తదిరులు హాజరవుతున్నట్లు తెలిపారు. లోక్ నాయక్ ఫౌండేషన్ పురస్కారాలను సినీ నటులు ఎన్‌టి.రామారావు, ప్రముఖ హిందీ కవి హరివంశరాయ్ బచ్చన్ వర్ధంతి రోజైనా జనవరి 18న ఏటా విశాఖలో ప్రదానం చేస్తున్న సంగతి తెలిసిందే.

రేషన్ కార్డు విభజనకు పచ్చజెండా

- ఎపి సేవా పోర్టల్‌లో ప్రత్యేక సర్వీసు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రేషన్ కార్డుల విభజనకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందుకోసం గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఎపి సేవా పోర్టల్‌లో ప్రత్యేక సర్వీసును అభివృద్ధి చేసింది. ఇప్పటికే ఈ సర్వీసును వైఎస్‌ఆర్ కడప జిల్లా, కడప కార్పొరేషన్, విజయనగరం జిల్లా గరివిడి మండలంలో పైలట్ ప్రాజెక్టు అమల్జేశారు. అక్కడ విజయవంతం కావడంతో దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమల్జేయాలని జివిడబ్ల్యువి అండ్ విఎస్‌డబ్ల్యుఎస్ శాఖ డైరెక్టర్ అండ్ కమిషనరు షన్మోహన్ మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. వివాహానంతరం ప్రత్యేకంగా కాపురం ఉంటున్నప్పటికీ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో ఉమ్మడి కుటుంబంగా నమోదైవున్న వారు ఆ కుటుంబం నుంచి వేరుపడి, విడిగా రేషన్ కార్డు పొందేందుకు ఈ సర్వీసును ఉపయోగించుకోవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనేక జిల్లాల నుంచి కలెక్టర్లు హౌస్ కార్డుల స్ప్లిట్టింగ్‌కు అవకాశం కల్పించాలని కోరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రేషన్ కార్డుల సమస్యలపై ప్రజలు నిలదీసిన నేపథ్యంలో ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల్లో పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం..హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ కోరేవారు కచ్చితంగా వివాహితులైవుండాలి. ఉమ్మడి కుటుంబంలో వివాహమైన రెండు జంటలు ఉండాలి. వేర్వేరుగా నివసిస్తుండాలి. వివాహ ధ్రువీకరణ పత్రం, ఆరోగ్యశ్రీ, బియ్యం కార్డు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్, పాస్‌పోర్టు, ఆధార్ కార్డుల్లో ఏదో ఒకటి పొందుపర్చాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కార్డు విభజనకు దరఖాస్తు చేసుకున్న జంట వేరుగా నివసిస్తున్నారని క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కార్డు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం 21 రోజుల్లో పూర్తి చేసి కొత్త కార్డు జారీ చేస్తామని, ఇందుకోసం ఫీజు ఏదీ లేదని తెలిపారు.

రీ సర్వే గ్రామాల్లో బయోమెట్రిక్ మినహాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూములు రీ సర్వే పనుల్లో నిమగ్నమైన గ్రామాల్లోని విఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లకు బయోమెట్రిక్ నుంచి ప్రభుత్వం మినహా యింపునిస్తూ అడిషనల్ సిసిఎల్‌ఎ కార్యదర్శి ఎఎండి ఇంతియాజ్ ఉత్తర్వులు ఈ నెల 13న జారీ చేశారు. అయితే ఈ విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 4న జిఎస్‌డబ్ల్యుఎస్ శాఖ సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి దృష్టికి బయోమెట్రిక్ హాజరు మినహాయింపు డిమాండ్‌ను ఆయా జిల్లాల ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో భూముల రీసర్వేలో పాల్గొనే విఆర్‌ఓ, గ్రామ సర్వేయర్లకు హాజరు నుంచి మినహాయింపు నివ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు.

పెన్షన్ రివిజన్ చేయాలని బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్ల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

బిఎస్‌ఎన్‌ఎల్ రిటైర్డు ఉద్యోగులకు తక్షణమే పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ది టెలికాం అండ్ బిఎస్‌ఎన్‌ఎల్ పెన్షనర్స్ విజయవాడ శాఖ ఆధ్వర్యాన విజయవాడ చుట్టుగుంటలోని బిఎస్‌ఎన్‌ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద పెన్షనర్లు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆలిండియా జనరల్ సెక్రటరీ వి.వరప్రసాద్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుండి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉండగా, ఐదేళ్లు దాటినా రివిజన్ జరగలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తమను ప్రభుత్వ పెన్షనర్లుగా పరిగణిస్తున్నా పెన్షన్ రివిజన్ చేయడంలేదన్నారు. ఈ సమస్యపై గతంలోనే ప్రభుత్వానికి వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఏడో సిపిఎస్ ప్రకారం పెన్షన్ రివిజన్ చేయాలని కోరారు. ఈ నిరసనలో ఆల్ ఇండియా పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులతోపాటు రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ అడ్వైజర్ ఎం.ఆర్.ఎస్.ప్రకాశరావు, కృష్ణా జిల్లా అధ్యక్షులు పూర్ణ చంద్రరావు, జిల్లా కార్యదర్శి సి.భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ సర్కిల్ కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



విజయవాడ చుట్టుగుంటలోని బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు



కర్నూలులో గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న కెవిపిఎస్ నేతలు

సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా అమలు చేసే విధంగా ఆర్డినెన్స్ తేవాలని, అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాయలసీమ యూనివర్సిటీ ఉద్యోగి ఇస్మాయిల్, రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీనివాసరావును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్ ఎదుట కెవిపిఎస్ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా కెవిపిఎస్ నేతలు మాట్లాడుతూ దళిత, గిరిజనుల ఆర్థిక ప్రగతి కోసం, దళితవాడల అభివృద్ధిని కాంక్షిస్తూ ఉమ్మడి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉద్యమించిన ఫలితంగా అప్పటి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం-2013ను పదేళ్ల కాలపరిమితితో తీసుకొచ్చిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుతం సబ్ ప్లాన్‌కు సరిపడా నిధులు కేటాయించకుండా, కేటాయించిన నిధులు వారి అభివృద్ధికి ఖర్చు చేయకుండా ఇతర పథకాలకు మళ్లిస్తోందని విమర్శించారు. దళితవాడలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని తెలిపారు. అరకొర కేటాయింపుల వల్ల దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందలేదన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు ఎంతవరకు ఉపయోగపడ్డాయో దళితుల అభివృద్ధిపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వం శ్వేత పత్రాన్ని విడుదల చేయాలని, అంబేద్కర్‌ను కులం పేరుతో దూషించిన రాయలసీమ యూనివర్సిటీ ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ న్యూ సిటీ అధ్యక్షులు ఏసు రాజు అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రేపల్లె పెద్దబాబు, కెవిపిఎస్ ఓల్డ్ సిటీ కార్యదర్శి గురుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

'టిటిడి' ఆలయాలకు ఫిబ్రవరి1 కల్లా గ్రౌండింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)కి చెందిన శ్రీవాణి ట్రస్టు ఆర్థిక సహాయంతో చేపట్టనున్న 980 ఆలయాలకు ఫిబ్రవరి 1 కల్లా గ్రౌండింగ్ చేయాలని డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ప్రతి 30 ఆలయాలకు ఒక ఎఇని నియమించుకోవాలని, ఇంజనీరింగ్ అభ్యర్థులు దొరకని పక్షంలో కనీసం డిప్లమో అభ్యర్థులను ఎఇలుగా నియమించుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. సచివాలయం రెండో బ్లాక్‌లో మంగళవారం అన్ని జిల్లాల ఎండోమెంట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఆలయాల పనుల ప్రగతిని ఆయన సమీక్షించారు. ఈ ఆలయాల నిర్మాణ పనుల బాధ్యతను కాంట్రాక్టర్ల ప్రమేయం లేకుండా దేవాదాయశాఖ అధికారులకు అప్పజెప్పినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఆలయాలు సుదూర ప్రాంతాల్లో ఉండటం వల్ల పర్యవేక్షణ కష్టతరంగా ఉందని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల అధికారులు డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లగా.. కనీసం 15 లేక 20 ఆలయాలకు ఒక ఎఇని నియమించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ ఇన్ చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ హరి జవహర్‌లాల్, అదనపు కమిషనర్లు టి.చంద్రకుమార్, కె.రామచంద్రమోహన్, చీఫ్ ఇంజనీరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముగ్గురు తహశీల్దార్లు సస్పెన్షన్

- చౌటుపల్లి భూకుంభకోణంలో చర్య

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రభుత్వ భూములను కాజేసి, పరిహారాన్ని దిగమింగిన ముగ్గురు తహశీల్దారులపై మంగళవారం సస్పెన్షన్ వేట పడింది. కలువాయి మండలంలో విధులు నిర్వహించి ప్రస్తుతం తహశీల్దార్లుగా వెంకటాచలంలో నాగరాజు, గుడ్లూరువారి పల్లిలో లావణ్య, టిపి గూడూరులో హమీద్ పనిచేస్తున్నారు. వారిపై కలెక్టర్ చక్రధర్‌బాబు చర్యలు తీసుకున్నారు. కలువాయి మండలం చౌటపల్లి రిజర్వాయర్ భూసేకరణలో వారు చేతివాటం ప్రదర్శించారు. 30 ఎకరాల ప్రభుత్వ భూమిని తొమ్మిదిమంది ప్రయివేటు వ్యక్తులకు చెందినవిగా రికార్డులు తయారుచేశారు. సుమారు రూ 1.50 కోట్లు అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. 15 ఏళ్ల క్రితం ఈ వ్యవహారం చోటుచేసుకోగా కలెక్టర్‌కు తాజాగా నివేదిక అందింది.

ఐదో షెడ్యూల్ ప్రాంతంలో పిఎస్‌పిలను రద్దు చేయాలి : హెచ్‌ఆర్‌ఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో పంప్డ్ స్టోరేజ్ హైడ్రో పవర్ ప్రాజెక్ట్ (పిఎస్‌పి)లకు చట్టవిరుద్ధంగా చేసిన కేటాయింపును రాష్ట్ర ప్రభుత్వం రద్దుచేయాలని మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. షిర్డిసాయి ఎలక్ట్రికల్స్, అదాని గ్రీన్ ఎనర్జీ సంస్థలకు ఇచ్చిన అనుమతులు రద్దుచేసి, గిరిజన చట్టాలను గౌరవించాలని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై రాజేష్, ఎపి, తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యులు విఎస్ కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అల్లూరి జిల్లా చింతపల్లి మండలంలోని యర్రవరం, అనంతగిరి మండలంలోని పెదకోట, మన్యం జిల్లా సాలూరు మండలంలోని కురుకుట్టి, పాచిపెంట మండలంలోని కర్రివలసలో ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతాలను హెచ్‌ఆర్‌ఎఫ్ బృందం పర్యటించినట్లు వారు తెలిపారు. పిఎస్‌పిలను గిరిజనులు వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో పీసా, ఎఫ్‌ఆర్‌ఎ ప్రకారం స్థానిక ఆదివాసీలతో చర్చించి, గ్రామ సభల అనుమతి తీసుకోవాల్సివుందని గుర్తుచేశారు. షెడ్యూల్ ప్రాంతంలో ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు ఎటువంటి ప్రాజెక్టులూ స్థాపించకూడదని సమత కేసులో 1997లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. పిఎస్‌పిలతో ఆదివాసీల జీవనోపాధి కోల్పోవడమే కాకుండా, జలవనరులు దెబ్బతినడం వల్ల తాండవ, రైవాడ రిజర్వాయర్, వెంగళరాయసాగర్ ఆయకట్టుకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు.

రైతులకు షాక్!

- భారంగా విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ధరలు
- ఇతర ఉపకరణాలపైనా భారీగా పెంపు

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

రైతులకు రాష్ట్ర ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ ఇకపై భారం కానుంది. ఎపి ఎస్‌పిడిసిఎల్ పరిధిలో విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు వసూలు చేసే మొత్తం పెరగనుంది. ఇతర విద్యుత్తు ఉపకరణాల ధరలు పెంచనుండడంతో రైతులకు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ తీవ్ర ఆర్థిక భారం కానుంది. ఉమ్మడి కర్నూలు పరిధిలో అన్ని కేటగిరీల్లో కలిపి 16.6 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. 400 కెవి ఉప కేంద్రం ఒకటి, 220 కెవి ఉప కేంద్రాలు 12, 132 కెవి ఉప కేంద్రాలు 8, 33/11 కెవి ఉప కేంద్రాలు 245 చోట్ల ఉన్నట్లు రికార్డులు తెలియజేస్తున్నాయి. లక్షకుపైగా సింగిల్ ఫేస్, త్రీ ఫేస్ విద్యుత్తు నియంత్రికలు ఉన్నాయి. వెయ్యికిపైగా ఫీడర్లు ఉండగా, వాటిలో వ్యవసాయానికి 640 ఫీడర్ల ద్వారా సరఫరా జరుగుతోంది. నాలుగు నెలల క్రితం 25 కెవి విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ధర రూ.61,216 ఉండేది. ప్రస్తుతం దీని ధరను రూ.1,39,999కు పెంచింది. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కు సుమారు రూ.78 వేలకుపైగా ధర పెంచేసింది. మునుపెన్నడూ ఇంత భారీగా ధరలు పెరగలేదు. తయారీ సంస్థలకు మేలు చేసే ఉద్దేశంతో అధికంగా ధరలు ఖరారు చేశారన్న చర్చ జరుగుతోంది. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితంగా ఉన్న



సంస్థలకు ఆర్థికంగా మేలు చేయాలన్న ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైర్లు, ఎనిమిది మీటర్లు, 9.1 మీటర్లు, 11 మీటర్లు పొడవు ఉన్న విద్యుత్తు స్తంభాల డిస్కులు, ఇన్సులేటర్లు, కాసారాలు, జిఐ ఎర్త్ పైపులు, ఎబి స్విచ్చులు ఇలా అన్నిరకాల సామగ్రి ధరలను పెంచేశారు. వ్యవసాయ సర్వీసులు కావాలని కొత్తగా దరఖాస్తు చేసుకుంటే రైతులు 10 హార్స్ పవర్ సామర్థ్యానికి ప్రస్తుతం రూ.12,500 చెల్లించాల్సి ఉంది. 25 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మూడు స్తంభాలు, 180 మీటర్ల పొడవు ఉన్న మూడు లైన్ల విద్యుత్తు తీగలు ఇస్తున్నారు. ఇంకా దూరం ఉంటే ఆ భారమంతా రైతు భరించాల్సి వస్తోంది. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు అన్ని ముడి సామగ్రి ధరలూ పెరగడంతో రైతులకు తీవ్ర భారంగా మారనుంది. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామనే పేరుతో ధరలు పెంచడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతులకే కాకుండా ఇతరులకు కూడా ఇవే ధరలు అమలు చేయనున్నారు.

ఏప్రిల్ తరువాత కొత్త రేట్లు

ప్రస్తుతం పాత రేట్లే కొనసాగుతున్నాయి. ఏప్రిల్ తరువాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. ప్రస్తుతం రెండు విద్యుత్తు స్తంభాల వరకూ ఉచితంగా ఇస్తాన్నాం. అదనంగా విద్యుత్తు స్తంభం కావాలంటే రూ.15 వేలు, ఒక హెచ్‌పి కనెక్షన్‌కు రూ.1,250 చొప్పున చెల్లించాలి.

- ఎం.ఉమాపతి, కర్నూలు విద్యుత్తు ఎస్‌ఇ


రోజుకు 1600 ఉద్యోగాలు ఊస్ట్

న్యూఢిల్లీ : కొత్త ఏడాదిలో ప్రపంచ వ్యాప్తంగా ప్రతీ రోజు దాదాపుగా 1600 చొప్పున టెక్నలాజీ ఉద్యోగాలు ఊడాయని ఆన్‌లైన్ వేదిక లేఆఫ్స్.ఎఫ్‌వైఐ ఓ రిపోర్టులో వెల్లడించింది. భారత్ సహా అన్ని దేశాల్లో తొలి 15 రోజుల్లో 91 టెక్ కంపెనీలు దాదాపు 24.000 మంది ఉద్యోగులను ఇంటికి పంపించాయని తెలిపింది. 2022లో 1000 కంపెనీలు తొలగించిన 1.5 లక్షల సిబ్బందితో పోల్చితే.. కొత్త ఏడాదిలో పరిస్థితి తీవ్రంగా ఉందని విశ్లేషించింది. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత్తి, మాంద్యం వల్ల అన్ని దేశాల్లోను కోతలు నమోదయ్యాయని పేర్కొంది. మెటా, అమెజాన్, ట్విట్టర్, బెట్టర్.కమ్, అలీబాబా ఉద్యోగుల ఉద్వాసనలు పలికిన వాటిలో ఉన్నాయని తెలిపింది.

శాస్త్రీయ ఆవిష్కరణలతో ఏ రంగమైనా అభివృద్ధి

- సినీ దర్శకుడు కె.రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో



ఎన్ఎస్‌టిఎల్ సైన్స్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కె.రాఘవేంద్రరావు

శాస్త్రీయ ఆవిష్కరణలతోనే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుందని, సినిమాల విజయం వెనుక కూడా ఇదే సూత్రం ఉంటుందని దర్శకులు, సినీ నిర్మాత డాక్టర్ కె.రాఘవేంద్ర రావు అన్నారు. విశాఖలోని ఎన్ఎడి వద్దగల ఎన్ఎస్‌టిఎల్ మహాపాత్ర మనసి ఆడిటోరియంలో ల్యాబ్ సైన్స్ కౌన్సిల్ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'నాన్ కాంటాక్ట్ క్రాస్ మీడియం కనెక్షన్' అన్న అంశంపై ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణ రంగంలో వినియోగించే ఆయుధ సామగ్రి వంటి వాటిలో డిఆర్‌డిఎ లేబొరేటరీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. శాస్త్రీయ సమాజం మాత్రమే దేశానికి సరైన దిశా నిర్దేశం, బలమైన పాజిటివ్ దృష్టిని ఇవ్వగలదని పేర్కొన్నారు. శాస్త్రీయ ప్రపంచం ఎంత అభివృద్ధి చెందితే సినిమా రంగంలోనూ ఆవిష్కరణలు ఆ విధంగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అవుట్ స్టాండింగ్ సైంటిస్ట్, ఎన్ఎస్‌టిఎల్ డైరెక్టర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ సైంటిస్టులు పివిఎస్ గణేష్‌కుమార్, బివిఎస్ఎస్ కృష్ణ కుమార్, ఇతర సైంటిస్టులు పాల్గొన్నారు.

జంతు కళేబరాలతో కల్తీ నూనె

- ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - కోటనందూరు

కాకినాడ జిల్లా తునిలోని రామకృష్ణ కాలనీలో జంతు కళేబరాలతో కల్తీ వంటనూనె తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి నూనె డబ్బాలు, పశువుల చర్మాలను స్వాధీనం చేసుకున్నారు. పెద్దాపురం ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఎం వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... రామకృష్ణ కాలనీలో ఒక ఇంటిలో కొంతకాలంగా పశువుల కళేబరాలతో వంట నూనె తయారు చేస్తున్నారు. పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. 84 నూనె డబ్బాలు, జంతు చర్మాలు, ఉప్పు బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. దీన్ని నిర్వహిస్తున్న మహ్మద్ షబ్బీర్, మహ్మద్ హారీష్‌ను అదుపులోకి తీసుకున్నామని డిఎస్‌పి చెప్పారు. ఈ దాడుల్లో తుని పట్టణ సిఐ ఎం నాగదుర్గారావు, ఎస్ఐ సిహెచ్ గోపాలకృష్ణ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఉగాదికి 5లక్షల ఇళ్ళలో గృహ ప్రవేశాలు జరిగేనా!

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు" పథకంలో భాగంగా ఉగాధి నాటికి 5లక్షల ఇళ్లలో లబ్ధిదారులచే ఒకే రోజు గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించింది. సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల గృహనిర్మాణశాఖపై నిర్వహించిన సమీక్షలో ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆశాఖ అధికారులు లబ్దిదారులపై ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 2.20లక్షల గృహాల నిర్మాణాలు పూర్తి కాగా ఉగాది నాటికి అంటే 60 రోజుల్లో మిగిలిన 2.80లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాల్సిఉంది. ఇది ఆచరణలో అసాధ్యమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు ఇంటి నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులు యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు ప్రారంభించకపోతే ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలను రద్దు చేసి వేరొకరికి కేటాయిస్తామని మండల స్థాయిలో తహసీల్దార్లు, గృహ నిర్మాణశాఖ అధికారులు లబ్దిదారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80లక్షలు, బ్యాంకుల రుణం ద్వారా ఇప్పించే రూ.35వేల రుణం పునాదుల వరకు కూడా సరిపోవని, కేవలం ఈ డబ్బుతో ఇల్లు నిర్మించాలంటే మరో మూడు నుంచి నాలుగు లక్షలు అప్పు తేవాల్సి వస్తోందని పలువురు లబ్ధిదారులు వాపోతున్నారు.

ఆప్షన్-3కి మంగళం పాడినట్లేనా?

సొంతంగా ఇల్లు నిర్మించుకోలేమనే లబ్దిదారులకు తాము ఇల్లు నిర్మిస్తామని హామీనిచ్చిన ప్రభుత్వం నేడు అందుకు బిన్నంగా మీరే ఇల్లు నిర్మించుకోవాలని వత్తిడి తెస్తున్నట్లు సమాచారం . ఆప్షన్ -3 కింద సుమారు 3లక్షల మంది ఎంపిక చేసుకున్నారు. ఇందులో అనేమంది మ్యాపింగ్ కూడా దూరంగా ఉన్నట్లు సమాచారం.

కొందరు నిర్మాణాలు పునాది దశ వరకు నిర్మించగా, మరి కొందరు ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదు. నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రత్యేకంగా మానిటరింగ్ చేసేందుకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి, గ్రామ వాలంటీర్ల ద్వారా రెగ్యులర్‌గా మానిటరింగ్ చేస్తున్నప్పటికీ లబ్ధిదారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం విశేషం. నిర్మాణాలకు సంబంధించి ఇనుము, సిమెంట్, ముడి సరుకు ధరలు భారీగా పెరగడం, లబ్ధిదారులు నిర్మాణాలను పర్యవేక్షించేందుకు కూడా ముందుకు రాక పోతుండటంతో లబ్దిదారులను ఆప్షన్-3 నుంచి తప్పుకోవాలని అధికారులు చెబుతున్నారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజనుల హక్కులు కాపాడాలి

తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు ఇఎఎస్ శర్మ లేఖ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని గిరిజనుల హక్కులను అక్కడున్న గిరిజనేతరులు ఉల్లంఘిస్తున్నారని, గిరిజనుల హక్కులు కాపాడాలని కోరుతూ తెలంగాణా ముఖ్యమంత్రి కెసిఆర్‌కు విశ్రాంత ఐఎఎస్ అధికారి ఇఎఎస్ శర్మ లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన పేర్కొన్న వివరాలిలావున్నాయి... '1/70 చట్టం (భూబదిలీల నియంత్రణ చట్టం 1, 1970)లో ప్రత్యేక రక్షణ హక్కులు కల్పించబడిందని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎస్.రమణారెడ్డి దాఖలు చేసిన ఎస్ఐఎల్‌ను సుప్రీంకోర్టు ఇటీవల అంగీకరించింది. ఎస్ఎల్‌పిలో భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని భూముల ప్రస్తావన ఉంది. అందులో లేవనెత్తిన అంశాలు తెలంగాణలోని షెడ్యూల్డ్ ప్రాంతాలకే కాకుండా ఎపిలోని వాటికి కూడా సంబంధించినవిగా ఉన్నాయి. 1/70 చట్టం ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాలలో భూమికి సంబంధించి గిరిజనులకు ఊహాజనిత హక్కును కల్పిస్తున్నందున ఈ కేసు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండింటిలోని ఆదివాసీలకు చాలా విస్తృతమైన చిక్కులను కలిగిస్తుంది. చట్టం ఏదైనా సడలింపు లేదా నిలిపివేయడం గిరిజనుల ప్రయోజనాలను దెబ్బతీస్తుంది.

గిరిజనుల భూములను గిరిజనేతరులు లాక్కోవడానికి చూస్తున్నారు. 1949 సెప్టెంబర్ 5వ తేదీ నాటి రాజ్యాంగ పరిషత్‌లో డాక్టర్ అంబేద్కర్ ఐదవ షెడ్యూల్ నిబంధనలను అసెంబ్లీకి ప్రవేశపెట్టినప్పుడు, గిరిజనులకు అన్ని విధాలుగా అభివృద్ధిలో రక్షణ కల్పించడంలో సమర్థనను వివరిస్తూ, రాజ్యాంగ సభ ప్రక్రియ సారాంశాన్ని లేఖతో పాటు జత చేశారు. రాష్ట్ర గవర్నర్ గిరిజనుల ప్రయోజనాలకు అనుగుణంగా కొత్త నియంత్రణను తీసుకురావచ్చు. రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు వర్తించే ఏదైనా ప్రస్తుత చట్టాన్ని స్వీకరించవచ్చు. షెడ్యూల్డ్ ప్రాంతాలలో తెలంగాణలోని కోయ, గోండు, ఎపిలోని షెడ్యూల్డ్ ప్రాంతాలలో గిరిజనేతర నివాసితులు గిరిజనుల భూములను లాక్కుని, వారిని ప్రలోభపెట్టి, అక్రమంగా రుణాలివ్వడం, బలవంతం చేయడం, ఇతర అనైతిక మార్గాలను అన్వేషిస్తున్నారు. గిరిజన ప్రాంతాలలో గిరిజనేతరుల ప్రవేశం గిరిజనుల విలువైన భూములను అన్యాక్రాంతం చేయటంతోపాటు సంస్కృతిలోని అనేక అవాంఛనీయ చొరబాట్లకు దారితీసింది. వారి ఆర్థిక పరిస్థితిని బలహీనపరిచింది. రాష్ట్రంలోని గిరిజనులకు శక్తివంతమైన చట్టాన్ని రూపొందించడం కోసం న్యాయస్థానంలో వాదనలను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ప్రయత్నించాలి. తెలంగాణ, ఎపిల్లో గిరిజనులకు జరుగుతున్న చారిత్రక అన్యాయాలకు తగినన్ని డాక్యుమెంటరీ ఆధారాలు హైదరాబాద్‌లోని గిరిజన పరిశోధనా సంస్థలో ఉన్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల పక్షాన దృఢంగా నిలుస్తుందని, 1/70 చట్టాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తుంది' అని ఆశిస్తున్నామని ఆయన లేఖలో పేర్కొన్నారు.

సిడ్స్ ఫార్మ్‌కు రూ.8 కోట్ల నిధులు

హైదరాబాద్ : డైరెక్ట్ టు కన్స్యూమర్ డెయిరీ బ్రాండ్ సిడ్స్ ఫార్మ్ ఒక మిలియన్ డాలర్ల (దాదాపు రూ.8 కోట్లు) నిధులు సమీకరించినట్లు తెలిపింది. బ్రిడ్జ్ రౌండ్‌లో తమ వినియోగదారులు, వారి రిఫరెల్స్ నుంచి ఈ మొత్తాన్ని పొందినట్లు మంగళవారం వెల్లడించింది. బ్రాండ్ యొక్క విశ్వసనీయత, అత్యున్నత నాణ్యత, సాటిలేని వినియోగదారుల అనుభవాలకు ప్రతీకగా ఇది నిలుస్తుందని సిడ్స్ ఫార్మ్ ఫౌండర్, ఎండి డాక్టర్ కిశోర్ ఇందుకూరి పేర్కొన్నారు. ఈ నిధులను నూతన ఉత్పత్తి అభివృద్ధి, మౌలిక వసతుల ఆధునీకరణ, డిజిటల్ పరివర్తన అవసరాల కోసం వినియోగించనున్నామన్నారు.

మార్సెల్లస్ నుంచి తొలి క్వాంట్ ఆధారిత ఫండ్

ముంబయి : పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ కంపెనీ మార్సెల్లస్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ వినూత్నమైన క్వాంట్ ఆధారిత ఫండ్ మార్సెల్లస్ మెరిటార్క్యును విడుదల చేసినట్లు ప్రకటించింది. దీన్ని రిటైల్ ఇన్వెస్టర్లకు రిస్క్ సర్దుబాటు చేసిన రాబడులను అందించేలా రూపకల్పన చేసినట్లు పేర్కొంది. కనీస పెట్టుబడి రూ.10 లక్షలుగా నిర్ణయించింది. దీనిలో పెద్ద, మధ్య, చిన్న తరహా 35-45 స్టాక్స్ ఉంటాయని.. ఈ ఫండ్‌ను నిఫ్టీ 500 టిఆర్ఐకు బెంచ్‌మార్క్ చేసినట్లు పేర్కొంది. తక్కువ ప్రతికూల రిస్క్‌తో అత్యుత్తమ రాబడిని అందించడానికి ఈ ఫండ్ దోహదం చేస్తుందని తెలిపింది.





భామిని ప్రధాన రహదారిపై ఘనసర కూడలిలో ఆందోళనకు దిగిన గ్రామస్తులు

ఏనుగుల దాడిలో రైతు మృతి

- మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి- భామిని (విజయనగరం జిల్లా)

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం తాలాడ గ్రామ సమీపంలోని కళ్లాల వద్ద సోమవారం రాత్రి అదే గ్రామానికి చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావు (53)పై ఏనుగుల గుంపు దాడి చేసింది. తీవ్ర గాయాలైన ఆయన శ్రీకాకుళం జిల్లా రాగోలులోని జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించారు. దీంతో, తలడా, ఘనసర, కేశరా, కొసలి గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు, యువత, రైతులు కలిసి కొత్తూరు-భామిని ప్రధాన రహదారిపై ఘనసర కూడలిలో బైఠాయించారు. ఉదయం పది గంటల నుంచి మూడు గంటలపాటు వాహన రాకపోకలను అడ్డుకున్నారు. రెండేళ్లుగా తమ గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నాయని, వాటి నుంచి పంటలకు, ప్రజలకు రక్షణ కల్పించాలని అధికారులకు పలు దఫాలు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఏనుగుల దాడిలో చిన్నారావు ప్రాణం కోల్పోవాల్సి వచ్చిందన్నారు. ఫారెస్ట్ రేంజర్ తవిటి నాయుడు, తహశీల్దార్ ఎన్.అప్పారావు, సిఐ మురళీధర్ అక్కడికి చేరుకున్నారు. చిన్నారావు కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇవ్వాలని అధికారులను ఆయా గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఏనుగులను శాశ్వతంగా తరలించాలని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం త్వరగా ఇప్పించాలని కోరారు. ప్రభుత్వం నిర్దేశించిన రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని, అదనపు పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, నెల రోజుల్లో ఏనుగుల తరలింపుపై చర్యలు తీసుకుంటామని, పంట నష్టపోయిన రైతులకు పరిహారం కోసం వ్యవసాయ శాఖాధికారితో పైఅధికారులకు నివేదిక పంపి న్యాయం జరిగేలా చూస్తామని అధికారులు హామీ ఇచ్చారు. దీంతో, ఆయా గ్రామస్తులు ఆందోళన విరమించారు. ఆందోళనకు టిడిపి నియోజకవర్గ నాయకులు పడాల భూదేవి, సిపిఎం మండల కార్యదర్శి జి.జగన్నాయకులు, కె.మిన్నారావు మద్దతిచ్చారు. సర్పంచులు మజ్జి మోహన్‌బాబు, కిలారి ఫల్గుణరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు భూపతి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



నగరిలో ముగ్గుల పోటీల్లో విజేతలతో ఆర్‌కె రోజా, ఆలీ

జగన్ ఆదేశిస్తే పోటీకి సై : ఆలీ

ప్రజాశక్తి - నగరి (చిత్తూరు జిల్లా)

సిఎం జగన్మోహన్‌రెడ్డి అనుమతిస్తే ఎక్కడినుంచైనా పోటీ చేస్తా' అని సినీనటులు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా అడ్వైజర్ అలీ తెలిపారు. సంక్రాంతి కొండచుట్టూ ఉత్సవం సందర్భంగా చిత్తూరు జిల్లా నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో సంక్రాంతి సాంస్కృతిక కళా సోయగం, ముగ్గుల పోటీలు అలరించాయి. రోజా ఛారిటబుల్ ట్రస్టు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక వ్యవహారాల, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్‌కె రోజా, అలీ విచ్చేశారు. తెలుగువారి సాంప్రదాయంగా ఎద్దుల బండిలో రోజా, ఆలీ సభా వేదిక వద్దకు వీరిద్దరూ చేరుకున్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, ఎల్ఇడి టివి, ఫ్యాన్ బహుమతులుగా అందజేశారు. అనంతరం అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఎవరి అధికారంలో అభివృద్ధి జరిగిందో ప్రజలు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వమే అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. నగరిలో మంత్రి రోజా భారీ మెజార్టీతో గెలుపొందుతారని ఆకాంక్షించారు. మంత్రి రాజాపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా డైమండ్ అనేది చాలా విలువతో కూడుకున్నదని, అందువల్ల డైమండ్ రాణి అనే వ్యాఖ్యలను పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. నిజంగానే రోజా కోహినూర్ వజ్రమని ప్రశంసించారు. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని, ఒకే కుటుంబంలో ఉండేవారంతా ఒకే పార్టీకి ఓటు వేయాలనే నిబంధన ఏమీ లేదన్నారు. పవన్‌కల్యాణ్‌పై పోటీ చేస్తారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశిస్తే తాను ఎక్కడినుంచైనా పోటీకి సిద్ధమన్నారు. మంత్రి రోజా మాట్లాడుతూ ప్రతిపక్షాల విమర్శలకు తాను ఎపుడూ కుంగిపోలేదన్నారు.

సంపాదకీయం

ఎందుకంత తొందర?


వలస కార్మికులు తాము నివసిస్తున్న చోటు నుంచి రిమోట్ ఓటింగ్ మిషన్ (ఆర్‌విఎం) ద్వారా ఓటు వేసే విధానాన్ని ఎటువంటి చర్చ లేకుండానే ఎన్నికల కమిషన్ (ఇసి) ఏకపక్షంగా ప్రతిపాదించడం పలు సందేహాలకు కారణమైంది. సోమవారం నాటి అఖిలపక్ష సమావేశంలో బిజెపి మినహా దాదాపు అన్ని పార్టీలూ ఆర్‌విఎం విధానాన్ని, ఇసి వాదనల్ని అంగీకరించకపోవడం సరైనదే. దేశంలో 30 కోట్ల మంది వరకూ ఉన్న వలస కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నారని, వారందరినీ ఎన్నికల ప్రక్రియలో భాగస్వామ్యం చేసి, ఓటింగ్ శాతాన్ని మెరుగుపరిచేందుకే ఆర్‌విఎం అన్న ఇసి వాదనకు ఎలాంటి ఆధారమూ లేదు. ముఖ్యంగా అంత భారీ సంఖ్యలో వలస కార్మికులున్నారనేది అవాస్తవం. అసలు రాజకీయ పార్టీలతో ఎటువంటి చర్చపెట్టకుండా ఆర్‌విఎంను ఒక్కసారిగా ముందుకు తేవడం వెనకున్న కారణాలేమిటనే ప్రశ్నకు సైతం ఇసి నుండి సమాధానం కరువైంది. నియోజకవర్గంలోని పోలింగ్ బూత్‌లలో ఆయా పార్టీల ఏజెంట్లు ఉండి స్లిప్పులోనున్న ఓటరును గుర్తిస్తారు. నూతన ప్రక్రియలో ఆర్‌విఎంల ద్వారా ఒక నియోజకవర్గానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఓట్లు నమోదవుతాయి. అభ్యర్థి ఆ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ఏజెంట్లను నియమిస్తారు తప్ప దేశమంతటా నియమించగలరా? ఇలాంటి ఎన్నో సమస్యలున్నాయి. అందువల్ల ఆ ఓటరు నిజమైన ఓటరో, దొంగ ఓట్లు వేయిస్తున్నారో గుర్తించే అవకాశమే ఉండదు. ఇప్పటికే డబ్బు, మద్యం, కులం, మతం... ఇలా ఎన్నో ప్రలోభాలతో అధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న అధికార పార్టీతోపాటు పాలకవర్గ పార్టీలు ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేయవచ్చునన్న రాజకీయ పార్టీల వాదన సహేతుకమే.

ఎన్నికల ప్రక్రియలో అన్ని పార్టీలకూ సమాన అవకాశాలు లభించకపోవడం, ఇవిఎంలపై ఇప్పటికీ కొనసాగుతున్న అనుమానాలపై ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఇవిఎంలలో ఓటరు తను వేసిన ఓటు సక్రమంగా పడిందో లేదో గుర్తించే అవకాశం లేకపోవడం ఒక లోపం. ఇవిఎంలలో ఓటు వేశాక (బటన్ నొక్కిన తరువాత) అది పేపర్‌పైనా నమోదై ఒక పెట్టెలో నిక్షిప్తం చేసే వివి ప్యాట్ విధానం ఉంది. ప్రతి నియోజకవర్గంలో పది శాతం ఓట్లు ఆ విధంగా వెరిఫై చేయాలన్నదీ ఉంది. కానీ ఆచరణలో అంతంతమాత్రమే! ఈ నేపథ్యంలో ఇప్పటికీ ఓటర్లలో ఈ ప్రక్రియపై అనేక సందేహాలున్నాయి. వీటన్నింటికీ సమాధానాలిచ్చి, ఓటర్లకు భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఉంది.

ఎలక్టోరల్ బాండ్ల పేరిట కార్పొరేట్ల నుండి నిధులు వసూలు చేసి, అత్యధిక భాగం అధికార పార్టీ ఖాతాలో జమవుతున్న పరిస్థితి ఇప్పటికే నెలకొంది. అందుకోసం నిబంధనలనూ ఎప్పటికప్పుడు సవరించడం, గడువులను పొడిగించడం జరుగుతోంది. ఇటీవల హిమాచల్ ప్రదేశ్ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించి, గుజరాత్ ప్రకటనను జాప్యం చేయడంలో అధికార పార్టీకి ఇసి లబ్ధి చేకూర్చిందన్నది జగమెరిగిన సత్యం. హడావుడిగా ఆర్‌విఎంలను తేవడం వెనుక కూడా అలాంటిదేమైనా ఉందా అన్న సందేహాలను పూర్తిగా కొట్టిపారేయలేం.

మన దేశంలో 15 కోట్ల మంది అంతర్గత వలసదారులున్నారని ఓ అంచనా. వారు ఓటు వేసేందుకు ఇబ్బందిపడుతున్న మాట వాస్తవం. అదే సమయంలో తొందరపాటుతో వ్యవహరిస్తే ప్రజాస్వామ్య ప్రక్రియే అపహాస్యం పాలయ్యే ప్రమాదం ఉంది. ఇందుకు సంబంధించి చట్టబద్ధమైన, పరిపాలనా పరమైన అంశాలతోపాటు వలస కార్మికులను నిర్వచించే అంశంపైనా అనేక ప్రశ్నలున్నాయి. ఈ ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలను కనుగొన్నప్పుడే ఎన్నికల ప్రక్రియలో సంస్కరణలు సత్ఫలితాలనిస్తాయి. ఓటింగ్‌శాతం పెరగడం అవసరమే. అదే సమయంలో ఆతృత వల్ల తప్పులు జరగకుండా చూడడం మరింత అవసరం. ఇటువంటి సంస్కరణలకు చొరవ చూపుతున్న ఇసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం గావించే దామాషా ఎన్నికల విధానం గురించి మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం సబబు కాదు.

మహనీయుల మాట



కేంద్రం నుంచి రాష్ట్రాలకు, రాష్ట్రాల నుంచి స్థానిక స్వయం పాలనా సంస్థలకు అధికార బదలాయింపు జరగాల్సి వుంటుంది. స్థానిక సంస్థలకు చాలినన్ని వనరులను కేటాయించడం రాష్ట్ర ప్రభుత్వాల విధి అన్నట్లు కేంద్రం ప్రవర్తిస్తున్నది. రాజ్యాంగ స్ఫూర్తికే ఇది విరుద్ధం. భారత రాజ్య వ్యవస్థ లోని మూడవ అంతస్తుకు నిధులను సమకూర్చడంలో రాష్ట్రానికి ఎంత బాధ్యత వున్నదో కేంద్రానికి కూడా అంతే బాధ్యత వున్నది.

- హరికిషన్ సింగ్ సూర్జిత్,
సిపి(ఐ)ఎం పూర్వ ప్రధాన కార్యదర్శి.

కార్పొరేట్లకు వరాలు...ప్రజలకు భారాలు

విశ్లేషణ

సాంకేతిక పరిజ్ఞానంలో, వాతావరణంలో వచ్చిన మార్పుల వలన ప్రతి కుటుంబంలోనూ, సంస్థలోనూ విద్యుత్ వినియోగం రోజురోజుకీ అధికమవుతున్నది. గతంలో ప్రభుత్వ రంగానికే పరిమితమైన విద్యుత్ క్రమంగా ఉత్పత్తి మొదలుకొని పంపిణీ వరకు బడా కంపెనీల పరమవుతున్నది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ చట్ట సవరణలు, సంస్కరణల ముసుగులో అడ్డగోలు దోపిడీకి అవకాశం కల్పిస్తున్నది. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం పూర్తిగా లొంగిపోయింది.

ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని, ఇక బాదుడు ఉండదని, 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందరికి అందిస్తామని జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎ) తిరగ రాస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. కానీ అది జరగలేదు.


దొడ్డి దారిన జగన్ మార్కు బాదుడు

ఈ 44 నెల కాలంలో దొడ్డిదారిన విద్యుత్ భారాలు ప్రజలపై మోపారు. గత సంవత్సరం స్లాబులు మార్చి, రేట్లు పెంచి ప్రత్యక్షంగా 1400 కోట్ల రూపాయల భారం వేశారు. 2014 నుండి 19 వరకు వినియోగించుకున్న కరెంటుకు బిల్లులు కట్టినా, సరిపోలేదని చెప్పి ట్రూ అప్ చార్జీల పేరుతో అదనంగా 2820 కోట్ల రూపాయలు వడ్డించారు. ఆరు నెలల క్రితం ప్రారంభమైన ఈ వసూళు మరో 30 నెలలు కొనసాగుతాయి. మరో రూ. 896 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. అదనపు డిపాజిట్లు, పెనాల్టీలు, విద్యుత్ సుంకం, స్థిరచార్జీల పేరుతో కనపడకుండా పీక్కు తింటున్నారు. చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలు, చిన్న పరిశ్రమలు, స్థానిక సంస్థలను వదిలిపెట్టకుండా చార్జీలు పెంచేశారు. ఈ భారం పరోక్షంగా సాధారణ ప్రజలపైనే పడుతుంది. ఎస్సీ, ఎస్టీ వర్గాలు, ఇతరులకు 200 యూనిట్ల వరకు ఉచితంగా అందించే విద్యుత్తుకు తూట్లు పొడుస్తున్నారు.



సిహెచ్. బాబూరావు

2023-24 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ పంపిణీ సంస్థలు తమ వార్షిక ఆదాయ నివేదికలను విద్యుత్ నియంత్రణ మండలి (ఇఆర్‌సి) ముందు ఉంచారు. ఈ నెల 19, 20, 21 తేదీల్లో మండలి దీనిపై ఆన్‌లైన్‌లో బహిరంగ విచారణ జరుపనున్నది. సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన మార్పుల వలన విద్యుత్ చౌకగా ఉత్పత్తి చేయవచ్చు. కరెంటు చార్జీలు తగ్గించవచ్చు. భారాలు వేయవలసిన అవసరమే లేదు. కానీ పాలకులు చార్జీలు పెంచుతూనే వున్నారు. ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఈ భారాలు ఎందుకు



పెరుగుతున్నాయి? ఎవరు కారణం? పరిశీలిద్దాం.

కార్పొరేట్లకు మేలు, ప్రజలకు కీడు

సాధారణ ప్రజలకు అర్థం కాని రీతిలో విద్యుత్ ఉత్పత్తికి అయిన ఖర్చును పూర్తిగా ప్రజల నుండే రాబట్టే పద్ధతిలో విద్యుత్ రేట్లు ప్రతిపాదించారు. భారీ పరిశ్రమలపై 697 కోట్ల రూపాయల ఛార్జీల పెంపు ప్రతిపాదించారు. ఆదాయం కంటే ఖర్చు 12,792 కోట్ల రూపాయలు అదనంగా ఉంటుందని లోటు తేల్చారు. ఈ లోటును ఎలా భర్తీ చేస్తారో చెప్పలేదు. ప్రభుత్వం ఈ లోటు భరించకపోతే, దొడ్డి దారిన ప్రజలపై ఏదో ఒక రూపంలో భారం వేసే ప్రమాదం ఉంది. ఇదే కాకుండా 2020 నుంచి 2023 వరకు ప్రతి మూడు నెలలకు అదనపు ఖర్చులు లెక్కించి మళ్లీ ట్రూ అప్ చార్జీలు జనం నెత్తిన వేస్తారు.

కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రమాదకర విద్యుత్ సంస్కరణలను ముందుకు తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వాటికి దాసోహం అంటున్నది. రాష్ట్రంలోని కోటి 89 లక్షల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధమైంది. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల ప్రక్రియ ప్రారంభమైంది. వ్యవసాయంలో ఉచిత విద్యుత్‌కు క్రమంగా ఎసరుపెడతారు. సెల్‌ఫోన్ మాదిరిగానే ముందు డబ్బు చెల్లించి కరెంట్ బ్యాలెన్స్ వేయించుకుని విద్యుత్ వినియోగించుకునే విధానం రానున్నది. వ్యవసాయ విద్యుత్ పేరుతో అదానీ కంపెనీతో 30 సంవత్సరాలు పాటు 7 వేల మెగా వాట్ల విద్యుత్ ఒప్పందాన్ని గుట్టు చప్పుడు కాకుండా చేసుకున్నారు.

రాష్ట్రంలో బడా కంపెనీలు 29 పంప్డ హైడ్రో స్టోరేజ్ ప్లాంట్లను పెట్టనున్నాయి. ఈ సంస్థలు 33,240 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తాయి. కృష్ణపట్నంలోని అధునాతన ప్రభుత్వ థర్మల్‌ప్లాంటును అదానీ వంటి బడా కంపెనీలకు కట్టబెట్టటానికి రంగం సిద్ధమయ్యింది. ఇప్పటికే విద్యుత్ మిగులు ఉందని పంపిణీ సంస్థలు ప్రకటించాయి. భవిష్యత్తులో ఈ బడా కంపెనీలు అందించే విద్యుత్ కూడా వస్తే దీన్నంతా ఎవరు వినియోగించాలి? ప్రభుత్వ రంగంలో ఉన్న విద్యుత్ ప్లాంట్లను పూర్తిగా మూత వేసి, బడా కంపెనీలకు దోచుకునే అవకాశం కల్పించే కుట్ర ఇది. అవి ఇష్టారాజ్యంగా రేట్లు నిర్ణయిస్తే ఆ భారం మళ్లీ వినియోగదారులపైనే పడుతుంది.

తెర వెనుక మోడీ సర్కార్ పాపం

విద్యుత్ ఉత్పత్తి చేయడానికి వినియోగించే బొగ్గు గనులను కేంద్ర ప్రభుత్వం క్రమంగా అదానీ తదితర కార్పొరేట్లకు కట్టబెడుతున్నది. విదేశాల్లో సైతం ఈ కంపెనీలు గనులు కొనేశాయి. బొగ్గు సరఫరా చేసే పోర్టులు వీరి చేతుల్లోకి వచ్చేసాయి. బొగ్గు కృత్రిమ కొరత సృష్టించారు. రేట్లు పెంచేశారు. దేశంలో బొగ్గు నిల్వలు ఉన్నా ఆరు శాతం బొగ్గును విదేశాల నుండి దిగుమతి చేసుకోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను ఆదేశించింది. ఆ భారం వేసేది ప్రజల పైనే. సహజ వాయువుతో విద్యుత్ తయారుచేస్తారు. ఆ గ్యాస్‌ను మన రాష్ట్రంలో ఉన్న కంపెనీలకు కేంద్రం కేటాయించక పోవడంతో ఆ కంపెనీలు మూతపడ్డాయి. విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా, నిర్ణయించిన ఫిక్స్ చార్జీలు డబ్బు చెల్లించాల్సిందే.

> **రాష్ట్రంలోని కోటి 89 లక్షల విద్యుత్ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి రంగం సిద్ధమైంది. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్ల ప్రక్రియ ప్రారంభమైంది. వ్యవసాయంలో ఉచిత విద్యుత్‌కు క్రమంగా ఎసరుపెడతారు. సెల్‌ఫోన్ మాదిరిగానే ముందు డబ్బు చెల్లించి కరెంట్ బ్యాలెన్స్ వేయించుకుని విద్యుత్ వినియోగించుకునే విధానం రానున్నది. వ్యవసాయ విద్యుత్ పేరుతో అదానీ కంపెనీతో 30 సంవత్సరాలు పాటు 7 వేల మెగా వాట్ల విద్యుత్ ఒప్పందాన్ని గుట్టు చప్పుడు కాకుండా చేసుకున్నారు.**

ప్రభుత్వ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు విద్యుత్ ఉత్పత్తికి అవకాశం వున్నా దాన్ని నిలిపివేసి, దీర్ఘకాలిక ఒప్పందాల పేరుతో ప్రైవేట్ సంస్థల నుండి అధిక రేట్లు పెట్టి విద్యుత్ కొనుగోలు చేస్తున్నాయి. 2022-23 తొలి 6 నెలల్లోనే 24 గంటల సరఫరా సాకుతో ప్రైవేట్ విద్యుత్ కంపెనీల నుంచి 3590 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను అదనంగా రూ.1600 కోట్లు చెల్లించి కొనుగోలు చేశారు. విద్యుత్ నియంత్రణ మండలి రూ.4.31 రేటు నిర్ణయించినా, అధికంగా సగటున యూనిట్‌కు రూ.8.77 పైసలు చెల్లించారు. ఇందులో భారీ ఎత్తున అవినీతి చోటు చేసుకున్నది.

పర్యావరణ పరిరక్షణ పేరుతో సంప్రదాయేతర విద్యుత్ సోలార్, పవన విద్యుత్ (విండ్ పవర్) తదితర విద్యుత్తును ఖచ్చితంగా కొనుగోలు చేయాలని కేంద్రం ఆదేశిస్తున్నది. దీని కోసం ప్రైవేటు సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారు. ప్రస్తుతం రెండు రూపాయలకు దొరుకుతున్న సోలార్ విద్యుత్తును, పాత ఒప్పందాల పేరుతో యూనిట్‌కు రూ.4 నుండి రూ.18 వరకు చెల్లిస్తున్నారు. పవన విద్యుత్‌కు ఐదు రూపాయల వరకు చెల్లిస్తున్నారు. సంప్రదాయేతర విద్యుత్ వల్ల సంవత్సరానికి 5000 కోట్ల రూపాయలు నష్టపోతున్నామని ప్రభుత్వ పంపిణీ సంస్థలే ప్రకటించాయి. అంతేకాకుండా సంప్రదాయేతర విద్యుత్ వినియోగం కోసం ప్రభుత్వ థర్మల్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉన్నా, ఆ విద్యుత్ ఉత్పత్తి నిలిపివేసి వాటికి ఫిక్స్‌డ్ చార్జీలు చెల్లిస్తున్నారు. ఈరకంగా విద్యుత్ ఉత్పత్తి చేయకపోయినా రాబోయే సంవత్సరంలో 1553 కోట్ల రూపాయలు అదనంగా చెల్లించవలసి వస్తుందని పంపిణీ సంస్థలే ప్రతిపాదించాయి. ఈ భారంపడేది జనం పైనే. హిందుజా కంపెనీకి నియంత్రణ మండలి యూనిట్‌కు రూ.3.82 చెల్లించాలని నిర్ణయించింది. ఆ రేట్లు చాలవని, అదనంగా రూ.1200 కోట్లు చెల్లించాలని కంపెనీ పైరవీలు ప్రారంభించింది. ప్రభుత్వం దొడ్డి దారిన పంపిణీ సంస్థలపై ఒత్తిడి తెస్తున్నది. భవిష్యత్తులో ఇది చెల్లిస్తే ఈ భారం ఏదో రూపంలో ప్రజలపైనే పడుతుంది.

విద్యుత్‌ను వదలని అవినీతి

దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, బడా కాంట్రాక్టర్లు కుమ్మక్కయి దోచుకుంటున్నారు. రూ.13,252 కోట్ల ఖర్చు చేసే స్మార్ట్ మీటర్లు కొనుగోలులో వేల కోట్ల రూపాయల అవినీతి చోటు చేసుకుంటున్నదని పుంఖానుపుంఖాలుగా వార్తలు వస్తున్నాయి. మెటీరియల్ మొదలు ట్రాన్స్‌ఫార్మర్ల వరకు అధిక రేట్లు పెట్టి అవసరానికి మించి ముందుగానే కొనుగోలు చేసి ప్రజల సొమ్ము మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు పెడుతున్నారు, వారి జేబులు నింపుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ విద్యుత్తు, ఇతర తరగతులకు అందించే రాయితీలకు, లోటును భర్తీ చేయటానికి సబ్సిడీ విద్యుత్ పంపిణీ సంస్థలకు ఇవ్వాలి. కానీ సబ్సిడీ సక్రమంగా, సకాలంలో చెల్లించటం లేదు. వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయి. పంపిణీ సంస్థలు అప్పులు తెచ్చి, వడ్డీ భారాన్ని కూడా వినియోగదారుల పైనే వేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలు, బడా కంపెనీల దోపిడి, ప్రభుత్వాల అవినీతి, అపసవ్య విధానాలు ఈ భారాలకు కారణం.

ప్రభుత్వ రంగంలో ఉంటేనే ఇన్ని లోటుపాట్లు ఉన్నాయి. ఇక పూర్తిగా ఉత్పత్తి, పంపిణీ మొత్తం బడా కంపెనీల చేతిలోకి వెళ్తే దొంగల దోపిడీనే. ప్రస్తుతం ప్రభుత్వ చేతుల్లో ఉంటే అడిగే అవకాశం అయినా ఉంది. కార్పొరేట్ కంపెనీల చేతిలోకి వెళితే ప్రశ్నించే అవకాశం తగ్గిపోతుంది. అందుకే ఈ విధానాల్ని ప్రశ్నించాలి. ప్రమాదకర సంస్కరణలను అడ్డుకోవాలి.

2023-24వ సంవత్సరం రూ.13 వేల కోట్ల లోటు ప్రభుత్వమే భరించాలి, తక్షణమే అటువంటి ప్రకటన చేయాలి. వ్యవసాయ మీటర్లు, ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఆపాలి. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలి. నెలవారీగా విద్యుత్ రేట్లు పెంచే ప్రతిపాదన ఉపసంహరించాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పూర్తిగా కొనసాగించాలి. ప్రభుత్వం పంపిణీ సంస్థలకు సబ్సిడీ బకాయిలు వెంటనే ఇవ్వాలి. నియంత్రణ మండలి ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. అందుకు ప్రజాఉద్యమం సాగించాలి.

/ వ్యాసకర్త : సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు/

సమస్య

పండగ పూట కూడా పస్తులేనా...?



ఆంధ్రప్రదేశ్‌ను స్వచ్ఛమైన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు హరిత రాయబారులు (గ్రీన్ అంబాసిడర్లు) ఎంతో శ్రమిస్తున్నారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించి ప్రతి ఇంటిని శుభ్రంగా ఉంచుతున్నారు. కుళ్ళు కాలువల్లో చెత్తను, పూడికను తీసి దోమలు చేరకుండా మన ఆరోగ్యాలను కాపాడుతున్నారు. గ్రామాల్లో మృతి చెందిన జంతువులను తొలిగించి దుర్వాసన లేకుండా చేస్తున్నారు. ఎక్కడైనా అనాథలు చనిపోతే అంతిమ సంస్కారాలు చేస్తున్నారు. ఇటువంటి పనులు చెయ్యడానికి ఎవరూ ఇష్టపడరు. అయినా చెయ్యడానికిగల కారణం వాళ్ళందరూ రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు, సామాజికంగా ఎన్నో ఏళ్లపాటు అణచివేయబడిన దళితులు. ఇంటిల్లపాదిని ఆరోగ్యంగా ఉంచుతున్న వీళ్ల వారి ఇంట్లో ఎవరికైనా ఆరోగ్య సమస్య వస్తే దిక్కుతోచని స్థితిలో ఉంటున్నారు. తమ కుటుంబ సభ్యులకు తిండి పెట్టలేకపోతున్నారు. సంక్రాంతి పండగ అంటే తెలుగు ప్రజలు కొత్త బట్టలు వేసుకొని, మంచి పిండివంటలతో ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. అయితే వీరికి కొద్ది నెలలుగా (9 నుంచి 22 నెలల వరకు) జీతాలు లేవు. దీంతో పండగ రోజు కొత్త బట్టలు, పిండివంటల సంగతి తర్వాత. కనీసం పొట్ట నింపుకోలేక పస్తుండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు ఇస్తుంది. కానీ సామాన్య ప్రజలపై భారాలు మోపుతుంది. అందులో భాగంగానే రాష్ట్రాలకు వచ్చే పన్నులను కేంద్రం జీఎస్టీ పేరు మీద వసూలు చేస్తూ తిరిగి రాష్ట్రాలకు చెందాల్సిన నిధులు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వాలపై భారాలు వేసింది. మున్సిపాలిటీ, పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను పన్నుల రూపంలో వసూలు చేసుకొమ్మంది. వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం చిత్తం ప్రభు అంటూ పట్టణాలు, మున్సిపాలిటీల్లో నెలకు 60 రూపాయలు చొప్పున చెత్త పన్ను చెల్లించాలంటోంది. కుళాయిలకు మీటర్లు బిగించి నీటి పన్ను వసూలు చేస్తుంది. భూమి అధారితంగా ఇంటి పన్ను పెంచుతున్నది. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి 14,000 ట్రైసైకిళ్లు, 1034 ఆటోలు కొన్నది. కానీ వాటిని నడిపే కార్మికులకు మాత్రం సంవత్సరాలు తరబడి జీతాలు చెల్లించడం లేదు. మన రాష్ట్ర వ్యాప్తంగా 23,747 మంది, విజయనగరం జిల్లాలో 2,300 మందికి పైగా గ్రీన్ అంబాసిడర్లు పనిచేస్తున్నారు. వీరికి గౌరవ వేతనం రూ.6000 నుండి రూ.10 వేలకు పెంచుతున్నట్లు 2021 నవంబర్ 19న రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. పెంచిన జీతం పక్కన పెడితే అసలు జీతాలే సంవత్సరాల తరబడి చెల్లించడం లేదు. దీనితో వారు బతుకు బండి లాగలేక రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాలపై నెట్టేసి చేతులు దులుపుకున్నట్లు...రాష్ట్ర ప్రభుత్వం తెలివిగా పంచాయతీలు చెల్లించాలని...తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులు విడుదల చేస్తుందని అంటోంది. దీంతో చాలా ప్రాంతాల్లో పంచాయతీ నిధులు లేకపోవడంతో జీతాలు చెల్లించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చెల్లించినా రెండు, మూడు నెలలు మాత్రమే చెల్లిస్తున్నారు. చాలామంది గ్రీన్ అంబాసిడర్లు జీతాలు రాకపోవడంతో కుటుంబాన్ని సాకలేక పనులు మానేయాలనుకుంటున్నారు. కానీ పని మానేస్తే బకాయి ఉన్న జీతాలు వస్తాయో రావోనన్న భయంతో పనులు చేస్తున్నారు. గ్రీన్ అంబాసిడర్లకు బకాయి జీతాలు చెల్లించాలి. ప్రభుత్వం ఇస్తామన్న గౌరవ వేతనాలు రూ.10,000 ఇవ్వాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈ సమస్యల పరిష్కారానికై గ్రీన్ అంబాసిడర్లు అందరూ కలిసి ఒక్కటిగా పోరాడాలి.

- డి.రాము,
సెల్ : 9705545164

కవిత్వం

కలవరపాటు

నాలో ఏదో కలవరం
కలలో కూడా కకావికలం చేస్తూ
ఉన్నపళంగా తట్టి లేపుతుంది

సమాజాన్ని నడుముకు కట్టుకుని
జన జీవన సరళిని అక్కడే వదిలేసి
కాలం పరుగులు పెడుతుంటే
చాలా కలవరం వేస్తోంది

ఏ పేగు తీగను మీటినా
ఆ సగటు రాగమే తీస్తుంది
ఏ గుండెను తట్టినా
ఆ బతుకు చప్పుడే చేస్తుంది
ఈ ఒడిదుడుకుల్లో మనిషి స్థితి
ఏమైపోతుందోనన్న కలవరం

ఏ కరువు కథలోకి తొంగిచూసినా
ఆ చెట్టు మోడే కనిపిస్తుంది
ఏ పుట్టను పెకిలించినా
ఆ కబ్జా స్వరమే బుసలు
కొడుతుంది
ఈ జీవన గతుల అతుకుల దారిలో
జీవితం ఎక్కడ
పడిపోతుందేమోనని
ఒకటే కలవరం

ఏ రాతిని ముట్టుకున్నా
కర్షక ఆకలి ఘోష వినపడుతుంది
ఏ మనిషి మనసును కదిలించినా
ఆ కరువు కథే వినిపిస్తోంది
ఏ స్థితిని తాకినా
ఆ దు:ఖపు రాగమే పాడుతుంది

ముదిమి దాటినా సరే
ఈ మనిషి మదిలో
కలవరం తగ్గలేదనే గగుర్పాటును
తిలకించే కళ్ళకు కలవరం
ఎప్పటికి తగ్గుతుందో హతవిధీ.

- నరెద్దుల రాజారెడ్డి,
సెల్: 9666016636

నివాళి

ఆశయ దీపం

ప్రజా ఉద్యమ కార్యకర్తలకు ఉద్యమాక్షరాలు దిద్దించి, సామాజిక, ఆర్థిక పాఠాలు నేర్పి, కార్యకర్తల్ని నాయకులుగా తీర్చిదిద్దిన ధీశాలి. కర్నూలు జిల్లా సిపిఎం పార్టీ సీనియర్ నేత, రచయిత, కామ్రేడ్లకు పెద్దాయన తెలకపల్లి నరసింహయ్య వర్ధంతి నేడు. 'తారాజువ్వలు బుస్సుమని ఎగిరి మిరుమిట్లు గొలిపి, క్షణంలో మళ్ళీ పతనమవుతాయి. దీపం నిలకడగా నిరంతరం వెలుగునిస్తూనే వుంటుంది. అలాంటి దీపమే తెలకపల్లి నరసింహయ్య గారు' అని పార్టీ అగ్రనేతలు గౌరవంతో అభివర్ణించారాయనను. గార్గేయపురం లోని ఉన్నత సంప్రదాయ కుటుంబానికి చెందిన తెలకపల్లి రామయ్య, సరస్వతమ్మ దంపతులకు 1928 జూన్ 8న జన్మించిన నరసింహయ్య గారు చదివింది ఆనాటి ఎఫ్.ఎ మాత్రమే అయినా... రాజకీయ అర్థశాస్త్ర సూత్రాలను అలవోకగా చెప్పేవారు. తండ్రి రామయ్య ఆయుర్వేద వైద్యులు, ఆయుర్వేదంలో వైద్య విద్వాన్ సాధించినప్పటికి వృత్తి రీత్యా బ్రాంచి పోస్టు మాస్టర్‌గా పనిచేశారు. 1945 మే నెలలో 'అరుణతార', మహిళా ఉద్యమనేత టి.సి లక్ష్మమ్మతో వివాహం అయ్యింది. 1947 జనవరిలో జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులో ఆడిట్ క్లర్క్‌గా ఉద్యోగం సంపాదించారు. 18 స్టోర్లు ఆడిట్ చేసే బాధ్యత అప్పగించారు. మళ్ళీ అనారోగ్యం కలగడంతో ఎక్కువ రోజులు సెలవు పెట్టే అవకాశం లేకపోవడంతో ఉద్యోగం కాస్త పోయింది. అయితే కమ్యూనిస్టు ఉద్యమం గొప్పతనం తెలుసుకునే అవకాశం ఉద్యోగం చేసే సమయంలో కలిగింది. వెలుగోడు కోఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడిగా కామ్రేడ్ సుదర్శనవర్మ ఉండేవారు. వ్యవసాయ పరికరాలు, బండ్ల పట్టాలు, పేదలకు పంపిణీ అయ్యేలా చూసేవారు. ఆయన కర్నూలు సెంట్రల్ బ్యాంకుకు వస్తే సిబ్బంది ఆయనను ప్రత్యేకంగా చూసేవారు. 1949 జిల్లా బోర్డు ఎన్నికల్లో సుదర్శనవర్మను ఆ ప్రాంతం నుండి బోర్డు సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆయనొక్కడే



కమ్యూనిస్టు సభ్యుడు. అది పార్టీ గొప్పతనం అనే భావన నరసింహయ్యకు కలిగింది. స్నేహితుడు రాముడు ఇచ్చిన పుస్తకాలు తెలకపల్లి నరసింహయ్యను ఉద్యమం వైపు నడిచేలా ప్రభావితం చేశాయి. 1946లో కాంగ్రెసు పార్టీలో ఉన్న నరసింహయ్య 1948లో యూత్ కాంగ్రెస్ సభ్యుడయ్యారు. 1949లో కర్నూలు జిల్లా బోర్డుకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అక్రమాలకు పాల్పడటంతో దానిని వ్యతిరేకించి బయటికొచ్చారు. కమ్యూనిస్టు ఉద్యమ నేతగా పార్టీకి అంకితమైనారు. పదవుల కోసం ఏమాత్రం పరితపించని నేతగా, సౌమ్యులుగా పేరొందారు. అనారోగ్యంతోడు జైలుశిక్షలు అనుభవించారు. మరీ ముఖ్యంగా తీవ్రవాద ఉద్యమ విచ్ఛిన్నం తర్వాత సిపిఎంను జిల్లాలో నిలబెట్టడంలోనూ యువ కార్యకర్తలను తీర్చిదిద్దడంలోనూ ఆయనది ప్రధాన పాత్ర. అందుకే ఉద్యమ నిర్మాతగా ఆ పేరు వింటేనే ఒక గౌరవం ప్రతి ఒక్కరిలో తొణికిసలాడుతుంది. 1984లో నందమూరి తారకరావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏర్పాటు చేసిన భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి హైపవర్ కమిటీ వేశారు. అందులో ఆయనను సభ్యులుగా నియమించారంటే ఆయన అధ్యయనం అర్థమవుతుంది.

తెలకపల్లి నరసింహయ్య గారి జీవిత పుటలన్నీ ఎర్రజెండాకు అంకితమైనవే. ఆయన శ్రీమతి టి.సి లక్ష్మమ్మ ప్రజా ఉద్యమాల్లో మరీ ముఖ్యంగా మహిళా ఉద్యమాల నిర్మాణానికి అంకితమైనారు. 'నా భార్య టి.సి లక్ష్మమ్మ నా కమ్యూనిస్టు ఉద్యమ ప్రవేశానికి ఒక ప్రధాన ప్రేరణ' అని చెప్పుకున్నాడంటే ఆమె ఎంత ప్రభావశీలో అర్థమవుతుంది. అందరికీ అమ్మగా ఆ రోజుల్లో కార్యకర్తలకు సదా ఆహ్వానం పలికి ఆతిథ్యమిచ్చేది. వారి ముగ్గురు కుమారులు పోరుబాట పట్టినవారే. పెద్దబ్బాయి చంద్రం హెచ్‌ఏయల్ సంస్థలో పనిచేస్తూ సిఐటియును స్థాపించి, ఆ కార్మికుల సమస్యల సాధనకై 11 రోజులు సమ్మెలో పాల్గొని నిరాహారదీక్ష చేశారు. రెండవ కుమారుడు తెలకపల్లి రవి ప్రజాశక్తి ప్రారంభం నుంచి పని చేశారు. రాజకీయ విశ్లేషకులుగా సుపరిచితులు. మూడవ అబ్బాయి హరీంద్రనాథ్‌శర్మ గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సంఘాన్ని నిర్మించి కార్మికోద్యమంలో కృషి చేస్తున్నారు. మేనల్లుడు, రచయిత జంధ్యాల రఘుబాబు, మనవలు, మనవరాళ్లు కూడా ఉద్యమాల కార్యకర్తలుగా సానుభూతిపరులుగా వున్నారు.

టి.ఎన్ గారు ఇచ్చిన ప్రోత్సాహంతోనే హైదరాబాద్‌లో 2002లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జనకవనంలో పాల్గొని నేను కవిత చదివాను. ఆ రోజు పరిచయమైన సాహితీ స్రవంతిలో సామాన్య కార్యకర్తగా నా సాహిత్య జీవితాన్ని ప్రారంభించాను. ఒక సామాన్య కార్యకర్తనైన నన్ను ఒక స్థాయికి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. అద్దేపల్లి రామ్మోహన్‌రావు రాసిన కవిత టి.నరసింహయ్యకు సరిగ్గా సరిపోతుంది. "మా అమ్మ సూర్యుడు. మా నాన్న చంద్రుడు. పగలల్లా సూర్యుడు జీవశక్తి దగ్ధం చేసుకుంటూ ఆగని పరుగుతో కదిలిపోతూ అందరికీ జీవశక్తినిస్తాడు."

- కెంగార మోహన్,
రాష్ట్ర అధ్యక్షులు సాహితీ స్రవంతి,
సెల్ : 9493375447

ఫిబ్రవరి 5న ప్రజారవాణాపై జాతీయ వర్క్‌షాప్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జాతీయ స్థాయిలో ప్రజారవాణా ఎదుర్కొంటున్న సవాళ్లపై చర్చించేందుకు ఫిబ్రవరి 5న హైదరాబాద్‌లో జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ సదస్సుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి ఆర్‌టిసి సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నుండి 10 మంది ప్రతినిధులు హాజరుఅవుతారని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రజారవాణాకు ప్రైవేట్ రంగంనుండి ఎదురవుతున్న సవాళ్లు, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను చర్చించి ప్రజారవాణాను మరింత పటిష్ట పరిచేందుకు ఒక విధానపత్రంను తయారు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి

జమ్ము: జమ్ము కాశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య జరిగిన కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్గాం పట్టణంలోని జిల్లా కోర్టు సముదాయం సమీపంలో ఎన్‌కౌంటర్ జరిగింది. బుద్గామ్ జిల్లాలో అనుమానాస్పద వాహనాన్ని ఆపడానికి ఆర్మీ అధికారులు, పోలీసులు ప్రయత్నించారు. ఈ నేపథ్యంలో ఆ వాహనంలో ఉన్నవారు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఆర్మీ అధికారులు ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు మరణించారు. వారి నుంచి ఆయుధాలు, మందుగుండు సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, సైన్యం బుద్గామ్‌లోని ప్రాంతాన్ని చుట్టుముట్టారు. మిగిలిన ఉగ్రవాదులను పట్టుకునేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

ఒపిఎస్‌తో భారం : ఆర్‌బిఐ

న్యూఢిల్లీ : పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్) పునరుద్ధరిస్తే ప్రభుత్వ ఆర్థిక వనరులపై మున్ముందు తీవ్ర ఒత్తిడి పడుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) హెచ్చరించింది. కొన్ని రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) పునరుద్ధరించనుండటంతో ఆర్థిక ముఖచిత్రంలో పెను ముప్పు వాటిల్లనుందని, ఈ చర్యతో ఆర్థిక వనరుల పొదుపు దీర్ఘకాలం మనజాలదని ప్రభుత్వ వనరులు : 2022-23 బడ్జెట్లపై అధ్యయనం పేరుతో వెల్లడించిన ఆర్‌బిఐ నివేదిక స్పష్టం చేసింది. హిమాచల్‌ప్రదేశ్ సహా కాంగ్రెస్ నేతృత్వంలోని పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఒపిఎస్‌ను అమలు చేస్తున్న నేపథ్యంలో ఆర్‌బిఐ ఈ నివేదిక విడుదల చేయడం గమనార్హం.

తగ్గిన చైనా జనాభా !

బీజింగ్ : గతేడాది కాలంలో చైనా జనాభా 8,50,000 మేర క్షీణించింది. గత 60ఏళ్ల కాలంలో జనాభా క్షీణించడం ఇదే మొదటిసారి. 1961లో దేశవ్యాప్తంగా క్షామం నెలకొన్నపుడు ఈ పరిస్థితి ఎదురైంది. 2022 చివరి నాటికి చైనా జనాభా 141.1కోట్లుగా వుందని మంగళవారం జాతీయ గణాంకాల బ్యూరో తెలియజేసింది. ప్రపంచంలోనే అత్యంత జనాభా కలిగిన దేశంగా ఈ ఏడాది చైనాను భారత్ అధిగమిస్తుందని ఐక్యరాజ్య సమితి గతేడాది విడుదల చేసిన నివేదిక పేర్కొంది. చైనాలో 2022లో జననాల సంఖ్య 90.56లక్షలుగా వుంది. 2021తో పోలిస్తే ఈ సంఖ్య 10శాతానికి పైగా తగ్గింది. మరణాల సంఖ్య కోటి 41లక్షలుగా వుంది. 'ఒక బిడ్డ చాలు' అంటూ ఏళ్ల తరబడి అనుసరిస్తున్న విధానం నుంచి ఎక్కువమంది పిల్లలను కనాలంటూ గత దశాబ్ద కాలంగా చైనా ప్రభుత్వం ప్రచారం చేస్తూ వచ్చింది.

అంకెల గారడీ

- ఆర్థిక వ్యవస్థ వృద్ధి 7 శాతంగా అంచనా
- కేంద్రం లెక్కలపై నిపుణుల ఆశ్చర్యం
- ప్రజల్లో కొనుగోలు శక్తి లేనప్పుడు వృద్ధి సాధ్యం కాదని స్పష్టీకరణ



న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థకు సంబంధించి అంకెల గారడీతో మోడీ ప్రభుత్వం మాయ చేస్తున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాల్లో ఉన్నంత బలంగా బయటకు కనిపించటం లేదు. భారత్‌లో కుటుంబాల ఆదాయం మాత్రం పెరగటం లేదు. కొనుగోలు శక్తి క్షీణించి ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. ప్రజలు చేసే ఖర్చులే దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిని పెంచుతాయనీ, ఇలాంటి పరిస్థితుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందిందని ఎలా చెప్పగలుగుతామని ఆర్థిక నిపుణులు తెలిపారు. మోడీ అనుకూల మీడియా చేసే అతి ప్రచారం, సోషల్ మీడియాలో బిజెపి అనుకూల వర్గాలు చేసే అసత్య ప్రచారాలు.. దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2022-23లో భారత ఆర్థిక వ్యవస్థ ఎంత వృద్ధి చెందుతుందనే అంచనాను ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. మొదటి ముందస్తు అంచనా ప్రకారం ఆర్థిక వృద్ధి గతేడాది కంటే ఏడు శాతం అధికంగా ఉన్నది. 2023-24కు సంబంధించి ఫిబ్రవరి 1న పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌కు అంతా సానుకూలంగా ఉండే విధంగా ఈ గణాంకాలు ఉన్నాయని నిపుణులు తెలిపారు. ఈ అంచనాలు స్థిరంగా ఉండవనీ, సమయాన్ని బట్టి మారుతుంటాయని చెప్పారు. అయితే, ఈ అంచనా గణాంకాలు వాస్తవ స్థితిని ప్రతిబింబించటం లేదని తెలిపారు. ప్రజల ముందు కేంద్రం ప్రతిష్టను కాపాడుకునే చర్యల్లో భాగమే ఈ అంచనాలని చెప్పారు.

ప్రభుత్వ అంచనాల ప్రకారం.. ప్రయివేటు తుది వినియోగ వ్యయం (పిఎఫ్‌సిఇ) అంటే గృహాలు, ఇతర ప్రయివేటు సంస్థలు చేసే మొత్తం ఖర్చు, మొత్తం 2022-23లో జిడిపిలో 57.2 శాతంగా నిర్ణయించబడింది. గత ఏడాది అంటే 2021-22లో ఇది జిడిపిలో 56.9 శాతం. ఇది ఒక సానుకూల అంశమనీ, ప్రజల ఖర్చు దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తుందని తెలిపారు. మరొక సంవత్సరం క్రితం అంటే 2020-21లో సవరించిన అంచనాల ప్రకారం జిడిపిలో పిఎఫ్‌సిఇ వాటా 57.3 శాతంగా ఉన్నది. 2021-22లో ప్రయివేటు వ్యయం తగ్గింది. ప్రస్తుతం సంవత్సరంలో కొంచెం పెరిగింది. 2020-21 మొదటి మహమ్మారి సంవత్సరం కంటే ప్రస్తుత పిఎఫ్‌సిఇ తక్కువగా ఉండటం గమనించాల్సిన అంశం.

కరోనా మహమ్మారి కాలంలో ఆర్థిక వ్యవస్థ మందగించి, ప్రజలలో కొనుగోలు శక్తి లేదని.. అయితే, ప్రస్తుతం అలాంటి పరిస్థితులేవీ లేనప్పటికీ ప్రజల ఖర్చు తగ్గిపోయిందన్నారు. ప్రజల ఖర్చులు లేనప్పుడు.. దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధి ఎలా సాధించగలుగుతుందని నిపుణులు ప్రశ్నించారు. ఇతర చర్యలతో పాటు వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించడం ద్వారా ఖర్చులను పెంచి చూపి అంచనాలను కేంద్రం తనకు సానుకూలంగా మలుచుకుంటున్నదని చెప్పారు. ప్రజల చేతుల్లో డబ్బు, ఖర్చులు లేనప్పుడు నమోదయ్యే ఆర్థిక వృద్ధి సంపూర్ణమైంది కాదని తెలిపారు.

ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (జిఎఫ్‌సిఇ) ప్రస్తుతం సంవత్సరంలో 10.3 శాతంగా అంచనా వేయబడిందని వివరించారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల పేరుతో ప్రభుత్వం విచ్చలవిడిగా ఖర్చు చేసిందని తెలిపారు. అయితే, అసలైన వృద్ధి ప్రయివేటు ఖర్చులు పెరిగినపుడే సాధ్యమవుతుందని నిపుణులు అన్నారు. పిఎఫ్‌సిఇ, జిఎఫ్‌సిఇల మధ్య అంతరం అధికంగా ఉన్నదని తెలిపారు. 2021-22 ద్వితీయార్థంతో పిఎఫ్‌సిఇ రూ.45.9 లక్షల కోట్లు కాగా.. ప్రస్తుతం రెండో అర్ధభాగంలో రూ.45.8 లక్షల కోట్లుగా ఉన్నది. ఈ అంచనాలు చెప్తున్నదేమిటంటే.. ప్రస్తుత సంవత్సరం ద్వితీయార్థంలో గృహ వ్యయం తగ్గుతుంది. ఇది కఠిన పరిస్థితిని సూచిస్తుందని నిపుణులు చెప్పారు.



సదస్సులో మాట్లాడుతున్న బిమన్ బసు

జ్యోతిబసుకు ఘననివాళి

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు వర్ధంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా జెబిసిఎస్-ఎస్ఆర్ ఆధ్వర్యాన 'పంచాయతీరాజ్ వ్యవస్థ - జ్యోతిబసు పాత్ర' అనే అంశంపై బిమన్ బసు అధ్యక్షతన మంగళవారం కొల్‌కతాలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీమ్, పొలిట్‌బ్యూరో సభ్యులు సూర్యకాంతమిశ్రా తదితరులు మాట్లాడారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి జ్యోతిబసు చేసిన సేవలను వక్తలు కొనియాడారు.

విశాఖ మెట్రో రైలు ప్రాజక్టుకు నిధులు మంజూరు చేయాలి

- ఎంపి విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక రాజధాని అయిన విశాఖపట్నంలో మెట్రో రైలు ప్రాజక్టుకు రానున్న బడ్జెట్‌లో నిధులు మంజూరు చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరినట్లు రాజ్యసభ సభ్యులు, వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. విశాఖపట్నం నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు కలిపి మొత్తం 41 లక్షల మంది జనాభా నివసిస్తున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం 76.9 కిలోమీటర్ల మేర మెట్రో రైలు ప్రాజక్టు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించిందని, ఈ మేరకు 2017 మెట్రో రైలు పాలసీ అనుసరించి డిపిఆర్ (డీటెయిల్డ్ ప్రాజక్టు రిపోర్టు) సైతం సమర్పించిందని వివరించారు. ఎస్‌సి సబ్ ప్లాన్ అమలులో దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌సి సబ్ ప్లాన్ కింద దేశంలో 22 రాష్ట్రాల్లో మొత్తం 29.84 లక్షల మందికి లబ్ధిచేకూరగా, ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే 29.10 లక్షల మంది లబ్ధిపొందారని వివరించారు. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ స్వయంగా వెల్లడించిందని తెలిపారు.

ఆఫ్ఘన్ మాజీ ఎంపి నబిజాదా కాల్చివేత



కాబూల్ : ఆఫ్ఘన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు ముర్సాల్ నబిజాదాను గుర్తు తెలియని సాయుధులు కాబూల్‌లో ఆమె ఇంటివద్దనే కాల్చి చంపారు. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడిలో నబిజాదా, ఆమె అంగరక్షకుడు మరణించారని, ఆమె సోదరుడు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో సమాచారం తెలిపారని, వెంటనే పోలీసులు, భద్రతా బలగాలు రంగంలోకి దిగాయని, దర్యాప్తు ప్రారంభించాయని వారు పేర్కొన్నారు. ఇంతవరకు ఈ కేసుకు సంబంధించి ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు. 2021లో తాలిబన్లు అధికారం చేపట్టేవరకు నబిజాదా ఎంపీగా ఉన్నారు. ఆ సమయంలో చాలామంది రాజకీయ నేతలు దేశం విడిచి వెళ్లిపోయారు. నబిజాదా మాత్రం మహిళల హక్కుల కోసం పోరాడుతూ ఆఫ్ఘన్‌లోనే వుండిపోయారని మానవ హక్కుల పర్యవేక్షణా సంస్థ తాత్కాలిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిరానా హసన్ తెలిపారు. ఈ హత్యకు కారకులైన వారిని అరెస్టు చేసి శిక్షించాలని అమెరికా చార్జి డీ అఫైర్స్ కరేన్ డెకర్ డిమాండ్ చేశారు.

మధ్యప్రదేశ్‌లో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల ఉద్యమబాట

- ఫిబ్రవరి 26న భారీ నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్‌లో అధికార బిజెపి తీరుపై వివిధ వర్గాలు ఆందోళనకు దిగుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి ప్రభుత్వ ఉద్యోగులు శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో, పదోన్నతుల్లో, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలుజేస్తామని 2016లో సిఎం శివరాజ్ సింగ్ ప్రజలకు వాగ్దానం చేశారు. గత ఆరేళ్లుగా రాష్ట్రంలో అధికారంలో ఉన్నా... వాగ్దానాన్ని నిలబెట్టుకోవటంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్సీ, ఎస్టీ ప్రభుత్వ ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఈ అంశం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమకు ఇచ్చిన వాగ్దానాన్ని బిజెపి నెరవేర్చలేదని ఎస్‌సి, ఎస్‌టి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఎజెజెఎకెఎస్) ఫిబ్రవరి 26న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చింది. ఎజెజెఎకెఎస్ ప్రధాన కార్యదర్శి సూర్యవంశి మాట్లాడుతూ, "లక్షలాది మంది ప్రజలు హాజరైన సభలో సిఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ రిజర్వేషన్ల అమలుపై వాగ్దానం చేశారు. అన్ని రకాల నియామకాల్లో అమలుజేస్తామన్నారు. పాలనా విభాగం సైతం విధివిధానాలు సిద్ధం చేసింది. అయినా ఆరేళ్లుగా అమలు జేయకుండా అధికార బిజెపి కాలయాపన చేస్తూ వస్తోంది. ఆరోగ్యం, ఆర్థికం, కోఆపరేటివ్, జిల్లా కోర్టులు, మెడికల్ కాలేజీలు..ఇలా అన్నిచోట్లా ఔట్‌సోర్సింగ్ విధానంలో ఉద్యోగ ఖాళీల్ని భర్తీ చేస్తోంది. రిజర్వేషన్లు లేకుండా ఖాళీలను నింపుతున్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను బిజెపి సర్కార్ కాలరాస్తోంది" అని అన్నారు. తమ డిమాండ్లపై జనవరి 29లోగా ప్రభుత్వం నుండి స్పందన రాకపోతే, ఫిబ్రవరి 26న భోపాల్‌లో ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనకు దిగుతారని మీడియాకు వెల్లడించారు.

బ్లాక్ లిస్ట్‌లో మక్కి

- లష్కరే తోయిబా తీవ్రవాదిపై ఐక్యరాజ్య సమితి ఆంక్షలు

న్యూఢిల్లీ : నిధులను సమీకరించే, తీవ్రవాద కార్యకలాపాలకు ప్రణాళికలు రూపొందించే లష్కరే తోయిబా తీవ్రవాది అబ్దుల్ రహమాన్ మక్కిని భద్రతా మండలిలోని ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా ఆంక్షల కమిటీ బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. గతేడాది జూన్, నవంబరు మధ్యలో లష్కరే, జైషే మహ్మద్ నేతలు ఐదుగురిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని భారత్, అమెరికా నుండి ప్రతిపాదనలు రాగా అప్పట్లో చైనా అంగీకరించలేదు. ఆ ఐదుగురిలో ఒకరే ఈ మక్కి. కాగా చైనా వైఖరిలో ఇప్పుడు మార్పు వచ్చింది. మిగిలిన వారి విషయంలో కూడా ఆంక్షలు అమల్లోకి వస్తాయో లేదో తెలియదు. అబ్దుల్ రహమాన్ మక్కి, ఇతర లష్కరే-జమాత్ ఉద్-దవా తీవ్రవాదులు నిధులను సమీకరించడంలో, యువతను రిక్రూట్ చేసుకుని, వారిని హింస వైపునకు పురిగొల్పడంలో, భారత్‌లో ముఖ్యంగా జమ్ము కాశ్మీర్‌లో దాడులకు ప్రణాళికలు రూపొందించడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారంటూ మక్కిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టడానికి గల కారణాలను వివరిస్తూ కమిటీ పేర్కొంది. భారత్, అమెరికా తమ జాతీయ చట్టాల కింద మక్కిని తీవ్రవాదిగా పేర్కొన్నారు. బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలంటూ ఇరు దేశాలు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలోని ఐఎస్ఐఎల్, అల్‌ఖైదా ఆంక్షల కమిటీకి గతేడాది జూన్ 1న ప్రతిపాదించాయి.

ప్రభుత్వ తీరు మారకపోతే సమ్మె ఉధృతం

- బ్రిటన్ నర్సులు, టీచర్ల హెచ్చరిక



లండన్ : తమ వేతన వివాదాలను ఈ నెలాఖరులోగా పరిష్కరించని పక్షంలో ఫిబ్రవరి నుంచి నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్ఎస్) సిబ్బంది సమ్మె మరింత ఉధృతమవుతుందని రాయల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ (ఆర్‌సిఎన్) హెచ్చరించింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేస్తూ గత కొద్ది నెలలుగా బ్రిటన్‌లో వివిధ రంగాలకు చెందిన కార్మికులు, సిబ్బంది సమ్మె చేస్తున్నారు. ఎన్‌హెచ్ఎస్‌లో పదివేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, గతంలో ఎన్నడూ లేనంతగా రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్‌సిఎన్ ప్రధాన కార్యదర్శి పాట్ కుల్లెన్ తెలిపారు. ద్రవ్యోల్బణం పెరగడం, జీవన వ్యయ సంక్షోభం, తీవ్రమైన సిబ్బంది కొరత, పెరుగుతున్న పనిభారంతో నర్సులు ఎంతగా నిరుత్సాహానికి గురవుతున్నారో తాము అర్థం చేసుకున్నామని ఎన్‌హెచ్‌సి తాత్కాలిక చీఫ్ ఎగ్జిక్యూటివ్ సఫ్రాన్ కార్టెరీ పేర్కొన్నారు. ఈ సమ్మెలు కలిగించే తీవ్ర ప్రభావాన్ని చూస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత తీవ్రమయ్యే అవకాశాలు కూడా వున్నాయని, ఇలాంటి పరిస్థితులు కొనసాగాలని ఎవరూ కూడా కోరుకోరని అన్నారు. గతేడాది బ్రిటన్‌లో ద్రవ్యోల్బణం రికార్డు స్థాయిలో పెరిగింది. నవంబర్‌లో వినియోగదారుల ధరల సూచిక (సిపిఐ) 10.7 శాతానికి పెరిగింది. అయితే నర్సులకు మెరుగైన వేతనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైంది. నేడున్న వాస్తవ పరిస్థితులతో పోల్చినట్లైతే నర్సుల జీతాలు 2010లో కన్నా 20 శాతం తక్కువగా ఉన్నాయి. మరోవైపు వేతనాల పెంపు కోరుతూ ఉపాధ్యాయులు కూడా సమ్మెకే మొగ్గు చూపుతున్నారని నేషనల్ ఎడ్యుకేషన్ యూనియన్ (ఎన్ఇయు) పేర్కొంది.

చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని, కానీ ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపింది. జులైలో అందించిన ఐదు శాతం వేతనం పెంపు వాస్తవానికి పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో పోల్చితే ఏడుశాతం వేతన కోతకు సమానమని ఎన్ఇయు పేర్కొంది. వాస్తవ పరిస్థితులతో పోలిస్తే ప్రస్తుత వేతనంలో 20 శాతం క్షీణత ఉందని పేర్కొంది. దీంతో చాలామంది ఉపాధ్యాయ వృత్తినే వదిలివేయాలని భావిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. దేశవ్యాప్తంగా వివిధ రంగాల కార్మిక సంఘాలు విస్తృత సమ్మెలు చేపట్టడం, ఇప్పటికే కష్టాల్లో ఉన్న బ్రిటన్ ఆర్థిక వ్యవస్థను మరింత దెబ్బతీస్తోందని ఒక నివేదిక పేర్కొంది. పోస్టల్, రైల్వే సిబ్బంది సమ్మెతో రవాణా, నిల్వలు నవంబరులో క్షీణించాయని తెలిపింది. సమ్మెలు వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొంది.

భారత్‌లోనూ అవే మార్గదర్శకాలను పాటించండి

గూగుల్‌కు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : యూరప్‌లో అనుసరించే మార్గదర్శకాలను భారత్‌లో ఎందుకు పాటించడం లేదని సుప్రీంకోర్టు గూగుల్ సంస్థను మంగళవారం ప్రశ్నించింది. ఆండ్రాయిడ్ ఫోన్‌లలో ఉచితంగా యాప్‌లను ఇన్‌స్టాల్ చేసేందుకు యూరప్‌లో పాటించే మార్గదర్శకాలను భారత్‌లోనూ పాటిస్తారా అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ జె.బి.పార్థివాలాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. దీనిపై ప్రతిస్పందనను తదుపరి విచారణలో తెలపాలని గూగుల్‌ను ఆదేశించింది. ఎన్‌సిఎల్ఎటి నిర్ణయంపై ధర్మాసనం కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ.. విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

అన్యాయమైన, పోటీకి విరుద్ధమైన పద్ధతులను అవలంబిస్తున్న గూగుల్ సంస్థపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) రూ.1,338 కోట్ల జరిమానా విధించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలపై నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్ఎటి) స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతో గూగుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 2016లో ఆండ్రాయిడ్ ఫోన్‌లలో యాప్‌లను ఉచితంగా ఇన్‌స్టాల్ చేసే గూగుల్ చర్య అన్యాయమని ఇయు కమిషన్ గుర్తించిందని, అనంతరం ఈ విషయంలో ఎలా ముందుకు వెళ్లాలో సూచించిందని సిసిఐ సుప్రీంకోర్టుకి తెలిపింది. భారత్‌లో మాత్రం మునుపటి మార్గదర్శకాలను కొనసాగిస్తోందని, కమిషన్ సూచించిన ఆదేశాలకు కట్టుబడేందుకు సుముఖత చూపలేదని సిసిఐ పేర్కొంది. సిసిఐ విధించిన జరిమానాపై జనవరి 6న ఎన్‌సిఎల్ఎటి స్టే ఇచ్చేందుకు నిరాకరించడంతో పాటు మొత్తం జరిమానాలో పది శాతాన్ని మూడు వారాల్లోగా చెల్లించాలని ఆదేశించింది.

రైతులకు 'మద్దతు' కావాలి

(మొదటి పేజీ తరువాయి)

దానివల్ల ఉపాధి పెరుగుతుంది. పెట్టుబడులకూ ఇబ్బంది ఉండదు. అంటే ఒకవైపు వ్యవసాయం, పారిశ్రామికాభివృద్ధి సమంగా జరగాలి. థాయ్‌లాండ్, ఆసియన్ దేశాల్లో ఇది ఎక్కువగా ఉండటం వల్ల అక్కడ అభివృద్ధి పెరుగుతోంది.

ప్రైవేటు పెట్టుబడుల వల్ల దేశానికి వచ్చే ఉపయోగం ఏమిటి ?

ఇక్కడ ప్రైవేటు పెట్టుబడులు అంటే అదానీ, అంబానీ కాదు. అది క్రోనీ కాపిటలిజం. మన దేశంలో అభివృద్ధి కోసం ప్రభుత్వాలు పెట్టే పెట్టుబడి 10 నుండి 20 శాతంలోపే ఉంటుంది. మిగిలినదంతా ప్రైవేటు వ్యక్తులు పెట్టేది. ఇక్కడ వ్యవసాయం కూడా ప్రైవేటు రంగమే కదా. ప్రైవేటు అంటే చిన్న తరహా పరిశ్రమలు, ఎంఎస్ఎంఈలు ఇలాంటి వాటిని మరింత ప్రోత్సాహించాల్సి ఉంది. ఇది ఉత్పత్తుల ధరను నియంత్రించడమే కాకుండా వినియోగదారులకూ అందుబాటులో ఉంటుంది. ఉపాధి కారకంగానూ నిలుస్తుంది.

ఉపాధి హామీ పథకం దెబ్బతింటోంది. దీనికి కారణం ఏమిటి ?

దేశంలో ఉపాధి హామీకి కేంద్రస్థాయిలో కేటాయించాల్సిన నిధులు కేటాయించడం లేదు. వేతనాలు 15 రోజుల్లో ఇవ్వకపోతే సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో అసలు పనిదినాలనే తగ్గించే పరిస్థితి ఉంది. దీనికి బడ్జెట్లో కేటాయింపులు పెంచడం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలను ఆదుకోగలం. అంతేకాదు ఇది మారకం రూపంలో అన్ని రంగాల అభివృద్ధికి ఉపయోగపడుతోంది. ఉపాధి హామీలో జాన్‌రీజ్ అనే నిపుణుడు చెబుతున్న లెక్కల ప్రకారం పనిచేసిన వారికి వేతనాలు ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల రెండు సంవత్సరాలు కూడా ఉపాధి ఇవ్వడం లేదు. బడ్జెట్లో అంత పెడతాము. ఇంత పెడతాము అని చెబుతున్నా అంచనాలు పెట్టేప్పటికి కోతలు పెడుతున్నారు. పెద్దపెద్ద రంగాలకు ప్రభుత్వాల నుండి ఇచ్చే ఉచితాలను తగ్గించాలి. ఇలా ఇచ్చుకుంటూ పోతే ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని పోతుంది. ఉచితం అంటే పేదలకు ఇచ్చే ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాలుకాదు.

అసంఘటిత రంగాన్ని ఆదుకోవడానికి ఏ చర్యలు తీసుకోవాలి ?

ప్రస్తుతం ప్రభుత్వాలు ఎక్కువగా సంఘటిత రంగం గురించే ఆలోచిస్తుంటాయి. అది పదిశాతం మాత్రమే ఉంటుంది. మిగిలిన 90 శాతం అంఘటిత రంగం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. బడ్జెట్లో సగం సంఘటిత రంగానికే పోతే మిగిలిన వారికి ఏమిస్తాము. సంఘటితంలోనూ డాక్టర్లు, టీచర్లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. రూ.600 కూలీతో పనిచేసే వ్యవసాయ కార్మికులు, రైతుల పరిస్థితి ఏమిటి. వారికోసం బడ్జెట్ కేటాయింపులు పెంచాలి. కేటాయింపుల్లో సగం 10 శాతం మందికిపోతే ఎలా అనేది నా ప్రశ్న. భవిష్యత్‌లో అసంఘటిత రంగం ప్రధానంగా మారుతుంది. ఇప్పటి నుండి ఆదుకుంటే తప్ప దాన్ని కాపాడుకోలేము. సంఘటిత రంగం కొంతకాలమే ఉంటుంది. వ్యవసాయ కూలీలు, గిగ్ వర్కర్లకు ఏమీ రావు. వారికి సామాజిక భద్రత ఉండదు.

బెంగళూరు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల జరుగుతున్న నష్టాన్ని ఇంటింటికెళ్లి వివరించింది. ఈ బహిరంగ సభలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టింది.

ఎర్రజెండాల రెపరెపలు

సిలికాన్ నగరంగా పేరుగాంచిన బెంగళూరు నగరంలో సిఐటియు జాతీయ మహాసభ సందర్భంగా ఎర్ర జెండాల రెపరెపలు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి ప్రధాన ప్రాంతాల్లో సిఐటియు జెండాలను కట్టారు. మహాసభ జరిగే ప్యాలెస్ గ్రౌండ్ మైదానంలో ఎరుపు రంగు జెండాలతో ఎంతో అందంగా తీర్చిదిద్దారు. మహాసభ ప్రాంగణంలో ఎగ్జిబిషన్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సాయంత్రం సమయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

న్యాయవ్యవస్థసహా అన్నింటినీ బిజెపి, ఆర్ఎస్ఎస్ కబళిస్తున్నాయి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశపూర్వకంగానే దాడి చేస్తున్నారని విమర్శించారు.

జోక్యం చేసుకోవడం కోసమే
ప్రభుత్వ నామినీ : మమతా బెనర్జీ

కొలీజియం వ్యవస్థలో ప్రభుత్వ నామినీలు కూడా వుండాలన్న ప్రతిపాదనను పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా విమర్శించారు. న్యాయ వ్యవస్థ పనితీరులో నేరుగా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకునేందుకు ఇదొక కొత్త తరహా ప్రణాళిక అని వ్యాఖ్యానించారు. న్యాయ వ్యవస్థ ఎవరి జోక్యం లేకుండా సర్వస్వతంత్ర వ్యవస్థగా వుండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కొత్త ప్రతిపాదన కింద రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సిఫార్సులకు, సూచనలకు ఎలాంటి విలువ వుండదని చెప్పారు.




మీకోసం

జిడ్డు పట్టిన పెనాన్ని బాగా వేడి చేసి నిమ్మ చెక్క నల్లగా అయ్యేంత వరకు రుద్దాలి. ఆ తరువాత నిమ్మకాయ రసం, ఉప్పుతో పెనాన్ని బాగా రుద్దితే జిడ్డు పోతుంది.

జీవన సౌరభం

తనకు నచ్చితే మూర్ఖుడు సైతం ఘనకార్యం సాధిస్తాడు. కానీ వివేకి ప్రతి పనినీ తనకు నచ్చే రీతిలో మలచుకుంటాడు. ఏ పనీ అల్పమైనది కాదు.

మళ్లెప్పుడొస్తారు బాబూ ...



సంక్రాంతి పండగ...

మా ఊరు మాకు ఆహ్వానం పంపినట్లనిపించే సందర్భం!

ప్రయాణం చేస్తున్నంతసేపూ నాన్న మనసంతా తన బాల్యంలోకి ప్రవహిస్తున్నట్టు అనిపించింది.

మా ఊరి సైఫన్ కాలువ కట్టపై బస్సు దిగాం. నడుచుకుంటూ ఊళ్లోకి వెళుతుంటే ఎదురొచ్చిన ప్రతి వాళ్లు మమ్మల్ని పలకరించటం గొప్ప అనుభూతి! వారి చేతుల్లో కత్తో, పలుగో, పారో, పచ్చిగడ్డి మోపో మమ్మల్ని పలకరిస్తున్నట్లు అనిపించింది. ఊరి ఎంట్రన్స్‌లో ఉన్న చెరువు నీళ్లపై కీటకాలు కోలాటం ఆడుతుంటే అలలపై తేలుతున్న తెల్ల తామర పువ్వులు, ముడతలు పడిన పల్లె దేహంపై ముసలి చిరునవ్వు మెరిసినట్లు అనిపించింది.

దారంతా తెలిసిన మార్గమే అయినా ఏదో తెలియని కొత్తదనంతో పాత ముఖాలను వెతుకుతున్నాయి నాన్న కళ్లు. తాతయ్యతో పాటు ఎంతోమంది ఇప్పుడు లేకుండా పోయారు కదా నాన్న అన్నా నేను. మా తాతయ్య నడిచిన నేల దుమ్ము నాన్న కంట్లో నలుసై పడిందేమో, కన్నీళ్ళతో కొట్టుకుపోతుంటే కర్చీఫ్‌తో తుడుచుకుంటూ ఊ... అన్నాడు.

ఊరు ఎంత బాగుంది! స్వచ్ఛమైన గాలి, అచ్చమైన తెలుగు, కాలువలో చేపలు, పీతలు, నాటు కోళ్లు, కమ్మని పిండివంటలు, రంగురంగుల ముగ్గుల రంగవల్లులతో పల్లె వాకిళ్లు ఒళ్ళు విరుచుకుంటున్నాయి. మూడు రోజులపాటు జరిగిన పండగలో కోడిపందాలు, కబాడీ పోటీలతో పాటు ఎడ్ల పందాలు కూడా జరిగాయి.


తిరిగి వెళ్లే టైం రానే వచ్చింది. భోగి రోజు వేడి నీళ్ల కాసిచ్చిన కుంపట్లు ఆరి పోయాయి. రంగులద్దిన రంగవల్లులు చెరిగిపోయి రథంముగ్గె బయటికి దారి చూపిస్తున్నాయి. మనుషుల హడావుడి ప్రయాణం మళ్లీ మొదలైపోయింది. అందరం బస్సు ఎక్కాము హాస్టల్లో తన్ను వదిలి వెళుతున్న తల్లిదండ్రులను చూసి ఏడుస్తున్న చిన్నపిల్లాడి ముఖంలా మారిపోయింది మా ఊరు. బస్సు ఊరు దాటుతుంటే చూశాను.



పొలిమేరలో పెదనేరేడు చెట్టు
శతాబ్దాల కాలంగా మా ఊరి చిరునామా
తాతలు నాటి కాలంలో దయ్యాలకు ఆవాసం
ఆ తర్వాత ఎన్నో వేల పక్షులకు ఆధారం
ఇప్పుడు కొమ్ములు విరిగి వెండి మోడై మిగిలింది
ఇది పల్లె జీవనానికి నిదర్శనం
చెట్టు మోడయ్యాక పక్షులు ఎగిరిపోతాయి కానీ ప్రజలు వలసెళ్లిపోయాక పల్లెమోడై మనసు బరువై పెగలని గొంతుతో అంటు.... : మళ్లెప్పుడొస్తారు బాబూ ..'

- జూనియర్ జాషువా
10వ తరగతి, భాష్యం హైస్కూలు,
చంద్రమౌళి నగర్, గుంటూరు.

నేను గీసిన బొమ్మ





- బి. శివాంజలి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
నర్సింహులు పల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com


కేరళలో రుతుక్రమ సెలవులు

గ్రామాలు పట్టణాలు అన్న తేడా లేకుండా రుతుక్రమం మొదలైనప్పటి నుంచి చాలామంది ఆడపిల్లలు చదువుకు దూరమౌతున్నారని, ఆ రోజుల్లో పాఠశాల హాజరు శాతం తక్కువగా నమోదవుతుందని ఎన్నోసార్లు వింటాం. మరి ఈ సమస్యకు పరిష్కారమేంటి? ఉన్నతవిద్య అభ్యసించే విద్యార్థులు పరీక్షలకు అనుమతి పొందాలంటే నిర్ణీత హాజరు తప్పనిసరి. ఇటువంటి పరిస్థితుల్లో హాజరుశాతం తగ్గకుండా ఉండేందుకు బడిఈడు పిల్లల దగ్గర నుంచి, ఉన్నత విద్యాసంస్థల విద్యార్థినులు సైతం తీవ్ర మానసిక, శారీరక సమస్యలున్నప్పటికీ రుతుక్రమ సమయంలో విద్యాసంస్థలకు హాజరవుతుంటారు. ఇది వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలెదుర్కొంటారు. ఇది సాధారణ విషయం కాదు. ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన యూనివర్సల్ సమస్య.. ఇప్పుడు ఈ సమస్యకు పరిష్కారం దిశగా కేరళ వామపక్ష ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అక్కడి విద్యాసంస్థలన్నింటిలో విద్యార్థులకు రుతుక్రమ సెలవులు ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మార్పుకు నాంది పలికిన ఈ నిర్ణయం.. స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత దిశగా కేరళ అనుసరిస్తున్న విధానానికి నిదర్శనం. ఈ మార్గం అనుసరణీయం.. ఆచరణీయం..

'పీరియడ్స్ గురించి అందరూ మాట్లాడుకోవడం చాలా అవసరం. సమానత్వం అంటే సమాన అవకాశాలు ఇవ్వడం.. కానీ ఎవరూ దాన్ని సరిగ్గా అర్థం చేసుకోవడం లేదు. రుతుక్రమ సమయంలో మహిళలు చాలా ఇబ్బందులు పడతారు. ఆ సమయంలో వారికి కొన్ని ప్రయోజనాలు అందివ్వాలి. ఇది సమానత్వానికి వ్యతిరేకం కాదు. సమానత్వం అసలు స్వరూపం ఇదే. కానీ ఇది సమానత్వం కాదని, ఈ ప్రయోజనాలు మహిళలను బలహీనపరుస్తాయని కొందరంటారు. అలాంటి వారందరూ సమానత్వానికి అసలు అర్థం తెలుసుకోవాలి' అంటున్నారు సియుఎస్‌ఎటి స్టూడెంట్స్ యూనియన్ చైర్‌పర్సన్ నమితా జార్జ్.

విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాలంటే నిర్ణీత హాజరు తప్పనిసరి. 75 శాతం హాజరు ఉంటేనే పరీక్షలకు అనుమతి ఇచ్చే నిబంధన ఉన్న కేరళ కొచ్చిన్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (సియుఎస్‌ఎటి) రుతుక్రమ సెలవులను పొడిగిస్తూ విద్యార్థినుల హాజరు శాతాన్ని 73 శాతానికి తగ్గించింది. జనవరి 11 నుంచి ఈ విధానం అమల్లోకి తెస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలు లేకుండా ఓ యూనివర్శిటీ తీసుకున్న స్వచ్ఛంద నిర్ణయాన్ని స్వాగతించిన కేరళ ప్రభుత్వం ఆ ఒక్క యూనివర్శిటీకే కాకుండా భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో అమలు చేస్తామని కేరళ ప్రభుత్వం తరపున ఉన్నత విద్యా శాఖా మంత్రి ప్రకటించారు.

ఈ నిర్ణయమే కాదు.. ఇటీవలే స్త్రీ, పురుషులిద్దరూ సమానమని పాఠశాల స్థాయి



నుంచే నేర్పించాలన్న సదుద్దేశంతో పాఠశాలలన్నింటిలో ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులను సార్, మేడమ్ అన్న పిలుపులకు బదులు 'టీచర్' అనే పిలవాలంటూ కేరళ బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు జారీచేసింది.

సాధికారత దిశగా..

లింగ సమానత్వం కోసం చర్యలు తీసుకోవడంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది అనేందుకు అనేక దృగ్విషయాలు ఉన్నాయి. కేరళ పోలీస్ ఫోర్స్‌లో 25 శాతం మహిళల ప్రాతినిధ్యం ఉండేలా కృషి చేస్తోంది. ప్రస్తుతం 15 శాతం సాధించారు. 2018లో 578 మందితో కూడిన తొలి మహిళా బెటాలియన్ ప్రారంభించిన రాష్ట్రం కూడా కేరళే. ఇంకా మహిళా సాధికారతకు అద్దం పట్టేలా మొత్తం 14 జిల్లాల్లో 10 జిల్లాలకు మహిళా ఐఎఎస్ అధికారులను నియమించింది.

కరోనా లాక్‌డౌన్ సమయంలో మహిళలపై పెరిగిన హింస, అఘాయిత్యాలను నివారించేందుకు ప్రైవేట్, సైబర్ ప్రదేశాల్లో మహిళల రక్షణ కోసం 'పింక్ ప్రొటెక్షన్' పేరుతో ఓ ప్రత్యేక మహిళా పోలీస్ వింగ్‌ను కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 10 కార్లు, 40 ద్విచక్ర వాహనాలు, 20 సైకిళ్లను కేటాయించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు, సైబర్ బెదిరింపులు, వరకట్న హింస వంటివన్నీ నిరోధించేందుకు ఈ స్పెషల్ వింగ్ పనిచేస్తోంది.

'స్త్రీ, పురుషులిద్దరూ సమానమే.. మహిళల స్వేచ్ఛ, సమానత్వం, సాధికారత సాధించేందుకు కృషి చేస్తున్నాం' అని డప్పాలు పలికే బూర్జువా పాలక వర్గాలు మాటల్లో కాక.. చేతల్లో నిరూపిస్తున్న కేరళ ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలి.





సెలవులు ఇలా ఇస్తారు..

8000 మంది విద్యార్థులు గల యూనివర్శిటీలో సగానికి పైగా విద్యార్థినులే ఉన్నారు. పీరియడ్ సమయంలో క్లాసులకు హాజరయ్యేందుకు ఇబ్బంది పడుతున్నామని, పీరియడ్ సెలవులు మంజూరు చేయాలంటూ స్టూడెంట్స్ యూనియన్ కొన్ని రోజులుగా యూనివర్శిటీ ప్రతినిధులను కోరింది. దీనిపై సానుకూలంగా స్పందించిన వీసీ ఏడాదికి 24 రోజులు.. నెలకు 2 రోజుల చొప్పున విద్యార్థినులు, మహిళా సిబ్బందికి రుతుక్రమ సెలవులు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.



షూటింగ్ షురూ..


మహేష్‌బాబు - త్రివిక్రమ్ కాంబినేషన్లో రూపొందుతున్న సినిమా నేటి నుండి చిత్రీకరణ ప్రారంభమౌతోంది. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై మహేష్ - త్రివిక్రమ్ కలయికలో ఈ సినిమా చాలారోజుల కిందటే ప్రారంభమవ్వాల్సి ఉండగా మహేష్ కుటుంబంలో వరుస విషాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో షూటింగ్ ఆలస్యమైంది. చిత్ర విడుదల తేదీని ఆగస్టు 11గా ఇప్పటికే ప్రకటించారు. కథానాయికలుగా పూజాహెగ్డే, శ్రీలీల ఎంపికైనట్టు నిర్మాత నాగవంశీ తెలిపారు. 'అతడు', 'ఖలేజా' తర్వాత మహేష్ - త్రివిక్రమ్ కలయికలో రూపొందుతున్న చిత్రమిదే. తమన్ స్వరాలు సమకూరుస్తున్నారు. మహేష్ నటిస్తున్న 28వ చిత్రమిది.

'అవతార్-3' తాజా కబురు




'అవతార్'కు కొనసాగింపుగా వచ్చిన 'అవతార్ : ది వే ఆఫ్ వాటర్' గత నెలలో ప్రేక్షకుల ముందుకు వచ్చి బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఈ క్రమంలో 'అవతార్3' ఎలా ఉంటుంది? ఏ నేపథ్యంలో సాగుతుందన్న ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ప్రేక్షకుల ఉత్సుకత మరింత పెంచేలా ఇందుకు సంబంధించిన ఆసక్తికర విషయాన్ని దర్శకుడు జేమ్స్ కామెరూన్ వెల్లడించారు. ఇటీవల క్రిటిక్ ఛాయిస్ అవార్డ్స్ కార్యక్రమానికి విచ్చేసిన కామెరూన్ 'అవతార్3' గురించి మాట్లాడారు. అగ్ని ప్రధానంగా మూడో భాగం సాగుతుందని చెప్పారు. 'అగ్ని ఒక చిహ్నం.. ప్రయోజనకారి. మూడో భాగంలో ఇదే ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది. ఒమక్టయా, మెట్కైనా తెగలను మీరు కలుస్తారు. పాండోరాలోనే ఇదొక విభిన్నమైన ప్రదేశం' అని అన్నారు. మూడో భాగం పాండోరాలోని ఎడారిలాంటి ప్రదేశంలో సాగుతుందని హాలీవుడ్ టాక్. అక్కడ ఉండే సంపదను సొంతం చేసుకునేందుకు మనుషులు ఏం చేశారు? జేక్, అతడి కుటుంబ వారిని ఎలా అడ్డుకుంది? ఈ క్రమంలో జేక్ కుటుంబానికి ఎలాంటి ఆపద కలిగింది? వంటి అంశాలను కామెరూన్ మిళితం చేశారని అంటున్నారు. ఏదైమైనా దీని గురించి మరికొన్ని వివరాలు తెలియాలంటే చాలా కాలం ఆగాల్సిందే!

'సార్' బంజారా పాట



హీరో ధనుష్ నటిస్తున్న చిత్రం 'సార్.' తమిళంలో వాథి టైటిల్‌తో తెరకెక్కుతుంది. టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి డైరెక్ట్ చేస్తున్నాడు. మేకర్స్ తాజాగా ఈ చిత్రం నుంచి 'బంజారా...' పాటను లాంఛ్ చేశారు. జీవీ ప్రకాశ్ కుమార్ కంపోజ్ చేసిన ఈ పాటను అనురాగ్ కులకర్ణి పాడగా.. సుద్దాల అశోక్ తేజ రాశారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన మాస్టారు సాంగ్ సంగీత ప్రేమికులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని సితార ఎంటర్ టైన్‌మెంట్స్-ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ శ్రీకర స్టూడియోస్ బ్యానర్లపై నాగవంశి, సాయి సౌజన్య సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీలో మలయాళ నటి సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోండగా నటులు సాయికుమార్, తనికెళ్లభరణి కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అరవింద్ కృష్ణ సూపర్ హీరో లుక్




నటుడు అరవింద్ కష్ణ లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం 'ఏ మాస్టర్ పీస్'. సుకు పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ సరికొత్త తెలుగు సూపర్ హీరో మూవీగా వస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ జనవరి 26 నుంచి మొదలు కానుంది. ఏ మాస్టర్‌పీస్ వర్క్ నుంచి ఒక పీస్ అంటూ.. స్పోర్ట్స్ కారుపై సూపర్ హీరో లుక్‌లో నిలబడి ఉన్న అరవింద్ కష్ణ స్టిల్‌ను మేకర్స్ షేర్ చేయగా నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. ఈ చిత్రంలో బిగ్‌బాస్ ఫేం అషు రెడ్డి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. సినిమా బండి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీకాంత్ కండ్రగుల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు.

'పాదరాయ'తో హీరోయిన్‌గా మంగ్లీ



చక్రవర్తి చంద్రచూడ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పాదరాయ' చిత్రంతో ప్రముఖ జానపద గాయని మంగ్లీ హీరోయిన్‌గా మారనున్నారు. ఈ మూవీ టైటిల్‌ను బెంగుళూరులో ఆవిష్కరించారు. తెలుగుతో పాటు శాండల్‌వుడ్‌లోనూ అనేక సినిమాల్లో పాటలు పాడిన మంగ్లి అక్కడి ప్రేక్షకుల అభిమానాన్ని కూడా పొందారు. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 2013-14లో జరిగిన యదార్థ ఘటన ఆధారంగా ఈ సినిమా ఆరు రాష్ట్రాలతో సంబంధమున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని తారాగణం ఎంపిక ఇంకా జరుగుతోందని దర్శకుడు చంద్రచూడ్ మీడియాకు తెలిపారు. సిద్ధేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పతాకంపై ఆర్ చంద్రు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజనీశ్ లోకనాథ్ సంగీతాన్ని అందిస్తున్నారు.

టబు స్టన్నింగ్ ఫస్ట్ లుక్



బాలీవుడ్ యాక్టర్ అజయ్ దేవ్‌గన్ స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'భోళా'. స్టార్ హీరో కార్తీ నటించిన బ్లాక్ బస్టర్ ఖైదీ చిత్రానికి హిందీ రీమేక్‌గా ఈ మూవీ తెరకెక్కుతోంది. టబు కీలక పాత్రలో నటిస్తోంది. తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి టబు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను లాంఛ్ చేశారు. టబు ఐపీఎస్ ఆఫీసర్‌గా చేతిలో గన్‌తో స్టైలిష్ లుక్‌గా కనిపిస్తుంది. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో వస్తున్న ఈ చిత్రాన్ని మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. భోళా 3డీలో కూడా విడుదల కానుంది. అజయ్ దేవ్‌గన్ ఫిలిమ్స్, టీ-సిరీస్ ఫిలిమ్స్, రిలయన్స్ ఎంటర్‌టైన్ మెంట్, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ బ్యానర్లు సంయుక్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాయి.

అందరి దృష్టి విరాట్‌పైనే..

భారత్ × న్యూజిలాండ్ తొలి వన్డే నేడు



ప్రాక్టీస్‌లో పాల్గొన్న భారత జట్టు సభ్యులు



న్యూజిలాండ్ ఆటగాళ్ల ప్రాక్టీస్

హైదరాబాద్: ఉప్పల్ వేదికగా భారత్- న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి వన్డే బుధవారం జరగనుంది. శ్రీలంకతో జరిగిన వన్డే సిరీస్‌లో రెండు శతకాలు కొట్టిన మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి న్యూజిలాండ్‌పైనా రాణిస్తే సచిన్ రికార్డుకు చేరువ కావడం ఖాయం. వన్డే కెరీర్‌లో 46శతకాలు చేసిన కోహ్లి.. సచిన్ టెండూల్కర్(49సెంచరీలు) అత్యధిక సెంచరీల రికార్డుకు దగ్గర్లో ఉన్నాడు. ఈ పర్యటన అనంతరం ఆస్ట్రేలియా జట్టు భారత పర్యటనకు రానుంది. ఆ పర్యటనలో భాగంగా ఆస్ట్రేలియాతో వన్డే, టెస్ట్ సిరీస్‌లలో తలపడనుంది. ఈ రెండు సిరీస్‌లలో విరాట్ కోహ్లి మరో 3సెంచరీలను చేస్తే సచిన్ రికార్డుకు చేరుకోనున్నాడు.

శ్రేయస్ అయ్యర్‌కు గాయం..

న్యూజిలాండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు టీమిండియా మిడిల్ ఆర్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ దూరమయ్యాడు. వెన్నుగాయం కారణంగా అతడు సిరీస్ నుంచి వైదొలిగాడని బిసిసిఐ పేర్కొంది. శ్రేయస్ స్థానంలో రజత్ పటీదార్‌ని జట్టులోకి తీసుకున్నట్లు పేర్కొంది. చికిత్స కోసం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీకి వెళ్తాడని బిసిసిఐ ఓ ప్రకటన విడుదల చేసింది.

జట్లు(అంచనా)..

భారత్: రోహిత్(కెప్టెన్), హార్దిక్, శుభ్‌మన్, ఇషాన్(వికెట్ కీపర్), కోహ్లి, సూర్యకుమార్, పటీదార్, శార్దూల్, చాహల్, షమీ, సిరాజ్, ఉమ్రాన్.

న్యూజిలాండ్: టామ్ లాథమ్(కెప్టెన్, వికెట్ కీపర్), ఫిన్, కాన్వే, నికోల్స్, మిఛెల్, ఫిలిప్స్, బ్రాస్‌వెల్, సాంట్నర్, సోథీ, టక్నెర్, ఫెర్గుసన్.

షెడ్యూల్..

18(బుధ)	: తొలి వన్డే(హైదరాబాద్)
21(శని)	: రెండో వన్డే(రాయ్‌పూర్)
24(మంగళ)	: మూడో వన్డే(ఇండోర్)

ఉప్పల్ వన్డే మ్యాచ్‌కు 2,500 మందితో పటిష్ట భద్రత

- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు
- టికెట్లు బ్లాక్‌లో అమ్మితే కఠిన చర్యలు
- రాచకొండ సిపి డిఎస్ చౌహాన్

హైదరాబాద్: ఉప్పల్ స్టేడియంలో బుధవారం భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న వన్డే మ్యాచ్‌కు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసినట్టు రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొత్తం 2,500 మందితో భద్రత కల్పిస్తున్నట్టు వెల్లడించారు. మ్యాచ్ నేపథ్యంలో ఉప్పల్ స్టేడియం పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. బుధవారం మధ్యాహ్నం 1:30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుందని, 12 గంటల నుంచి స్టేడియంలోకి ప్రేక్షకులను అనుమతిస్తామని తెలిపారు. మైదానంలోకి సెల్‌ఫోన్ మినహా మరేదీ అనుమతించబోమని స్పష్టం చేశారు. పాసులు, బీసీసీఐ కార్డులు ఉన్న వారు మాత్రమే స్టేడియానికి రావాలన్నారు. మైదానంలోకి వెళ్లి క్రికెటర్లకు అడ్డుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ సమస్య రాకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. మహిళల భద్రత కోసం 40 మందితో షీ టీమ్‌లు ఏర్పాటు చేశామని చెప్పారు. క్రికెట్ బెట్టింగ్, బ్లాక్ టికెట్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. బ్లాక్ టికెట్ల విక్రయంపై ఇప్పటికే మూడు కేసులు నమోదు చేశామని, ఇలా అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీ రక్షితాతోపాటు ట్రాఫిక్ డీసీపీలు డి.శ్రీనివాస్, మురళి, ఉప్పల్ సీఐ గోవిందారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర 256/5

సౌరాష్ట్ర రంజీట్రోఫీ మ్యాచ్

రాజ్‌కోట్: సౌరాష్ట్ర క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న రంజీట్రోఫీ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలిరోజు 5వికెట్ల నష్టానికి 256పరుగులు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రకు ఓపెనర్లు జ్ఞానేశ్వర్(34), అభిషేక్ రెడ్డి(46) తొలి వికెట్‌కు 80పరుగులు జతచేశారు. ఆ తర్వాత కెప్టెన్ విహారి(38) నిరాశపరిచినా.. వికెట్ కీపర్ రికీ బుయ్(80) అర్ధసెంచరీతో రాణించారు. తొలిరోజు ఆట ముగిసే సమయానికి అశ్విన్ హెబ్బర్(22), లలిత్(2) క్రీజ్‌లో ఉన్నారు. సౌరాష్ట్ర బౌలర్లు డి.జడేజాకు మూడు, సకారియా, ఉనాద్కట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

లక్ష్యసేన్ శుభారంభం

ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్-750లో లక్ష్యసేన్ శుభారంభం చేశాడు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఇండియా ఓపెన్‌లో లక్ష్యసేన్ 21-14, 21-15తో భారత్‌కే చెందిన హెచ్‌ఎస్ ప్రణయ్‌రాయ్‌పై గెలిచాడు. డిఫెండింగ్ ఛాంపియన్ లక్ష్యసేన్ రెండోరౌండ్‌లో రస్మస్ జెంకే(డెన్మార్క్)తో తలపడనున్నాడు. ఇక పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ 21-13, 21-15తో స్కాట్లాండ్‌కు చెందిన క్రిస్టోఫర్-మాథ్యూపై, మహిళల డబుల్స్‌ల త్రీషా జోలీ-గాయత్రి గోపీచంద్ జోడీ 22-20, 17-21, 21-18తో ఫ్రాన్స్‌కు చెందిన మర్గోట్-అన్నె జోడీపై గెలిచారు. టాప్‌సీడ్ మొమొటో తొలిరౌండ్‌లో మొమొటో 15-21, 11-21తో రస్మస్ జెంకే చేతిలో ఓడాడు.

జకో సునాయాసంగా..



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ పురుషుల సింగిల్స్‌లో 4వ సీడ్, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్ శుభారంభం చేశాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ పోటీలో జకోవిచ్ 6-3, 6-4, 6-0తో అన్‌సీడెడ్ కార్బలీస్(స్పెయిన్)పై, 2వ సీడ్ రూడ్(నార్వే) 6-3, 7-6(8-6), 6-7(5-7), 6-3తో మఛక్(చెక్)పై, ఆండీ ముర్రే 6-3, 6-3, 4-6, 6-7(7-9), 7-6(10-6)తో మట్టెవో బెర్రెట్టినిపై చెమటోడ్చి నెగ్గాడు. 12వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ) 4-6, 6-1, 5-7, 7-6 (7-2), 6-4తో వరల్లియస్(పెరూ)పైనెగ్గాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68